ప్రభాత సూర్య PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 మంగళవారం 9 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79


## వెళ్లిపోతున్న విదేశీ నిధులు

భారతీయ స్టాక్ మార్కెట్లలో గత కొంతకాలంగా ప్రతికూల సెంటిమెంట్ కొనసాగుతోంది. ఫలితంగా మన మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులను వెనక్కి తీసుకెళ్తున్నారు. డిపాజిటరీ డేటా ప్రకారం, సెప్టెంబర్ మొదటి వారంలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ. 12,257 కోట్ల విలువైన నిధులను ఉపసంహరించుకున్నారు. ఇందుకు ప్రధానంగా భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాలు, డాలర్ మారకం బలంగా ఉండటం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు కారణాలుగా ఉన్నాయి. గత నెలలో ఎఫ్‌పీఐలు రూ. 34,990 కోట్లను, అంతకుముందు జూలైలో రూ. 17,700 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2025లో ఇప్పటివరకు మొత్తం రూ. 1.43 లక్షల కోట్ల విదేశీ నిధులు మన ఈక్విటీల నుంచి వెళ్లాయని డిపాజిటరీ డేటా పేర్కొంది.


విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# మూసీ పునరుజ్జీవం.. చేసి చూపిస్తాం

- సబర్మతి, గంగా, యమునలను అభివృద్ధి చేయొచ్చు గానీ.. మూసీ శుద్ధి జరగొద్దా?
- పదేళ్ల పాలనలో హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకురావాలన్న ఆలోచనే.. బీఆర్ఎస్‌కు రాలేదు
- తాటిచెట్టంత మనిషి.. మెదడు మోకాలులోనూ లేదు.. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తాగునీరు
- అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టే.. ప్రాణహిత-చేవెళ్లలోనూ మల్లన్నసాగర్ ప్రతిపాదన ఉంది
- కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులను ఆపొద్దు.. విపక్ష నేతల కుట్రలు తిప్పికొడతాం.. సంగతి తేలుస్తాం
- ప్రతిపక్షాలు అభివృద్ధిలో కలిసి రావాలి: సీఎం రేవంత్.. గోదావరి ఫేజ్- 2, 3, మూసీ ప్రాజెక్టులకు శంకుస్థాపన'

**హైదరాబాద్**

'ఎవరు అడ్డం పడినా.. అడ్డంకులు సృష్టించినా.. కుట్రలు, కుతంత్రాలు చేసినా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గుజరాత్‌లో మోదీ ఆధ్వర్యంలో సబర్మతి నది, యూపీలో యోగి నేతృత్వంలో గంగా నది, ఢిల్లీలో రేఖా గుప్తా నాయకత్వంలో యమునా నది తీరప్రాంత అభివృద్ధి పనులు చేపట్టారని, 4 కోట్ల ప్రజలు ఉన్న తెలంగాణలో మూసీ తీర ప్రాంత అభివృద్ధి జరగొద్దా? అని ప్రశ్నించారు. రూ.7,360కోట్లతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్-2, 3, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు సోమవారం గండిపేట వద్ద రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ నిజాం పాలకుల దూర దృష్టి వల్లే హైదరాబాద్‌కు ముంపు ముప్పు, తాగు నీటి సమస్యలకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. 1920, 1922లో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల నిర్మాణం పూర్తయితే.. వందేళ్లుగా హైదరాబాద్ దాహార్తి తీరుతోందన్నారు. కాంగ్రెస్ హయాం లోనే హైదరాబాద్‌కు మంజీరా, కృష్ణా, గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. గతంలో సచివాలయం ముందు ఖాళీ బిందెలు, కుండల ప్రదర్శనలు జరిగేవని, అలాంటి ఇబ్బందులన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే పరిష్కారం చూపిందన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచే హైదరాబాద్‌కు నీటి సరఫరా జరుగుతోందని, అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిందేనని పేర్కొన్నారు. సీఎంగా వైఎస్సార్, మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్నప్పుడు ప్రాజెక్టును ప్రారంభించగా... 2016లో హైదరాబాద్‌కు నీళ్లు వచ్చాయన్నారు. నాడు మునిసిపల్ మంత్రిగా ఉన్న ఒకాయన శామీర్‌పేట వద్ద నెత్తి మీద గోదావరి జలాలు చల్లుకున్నాడని, నీళ్లు చల్లుకున్నంత మాత్రాన చేసిన

- మిగతా2లో



## గుర్తింపు కార్డుగా ఆధార్

- బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశంలో ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం
- 9వ తేదీలోగా ఆదేశాలు అమలుచేయాలని సూచన
- అయితే ఆధార్ అనేది పౌరసత్వానికి రుజువు కాదని వ్యాఖ్య



## రాజకీయ యుద్ధాలకు కోర్టును వాడుకోవద్దు

- సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర శాఖ వేసిన పరువునష్టం కేసును డిస్మిస్ చేస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలన్న సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం
- పిటిషన్‌ను కొట్టేసినా వాదించే ప్రయత్నం చేసిన బీజేపీ తరఫు న్యాయవాది
- మండిపడ్డ సీజేఐ.. మళ్లీ ఇలాంటి పిటిషన్ వేస్తే రూ. 10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరిక

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ

- అన్ని ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి
- సీపీ రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిల మధ్య ముఖాముఖి పోటీ
- ఓటింగ్‌లో పాల్గొననున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు
- ఉదయం 10 గంటలకు పోలింగ్ షురూ..
- 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు..తర్వాత వెలువడనున్న ఫలితం



**న్యూఢిల్లీ**

దేశ తదుపరి ఉప రాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆరోగ్య కారణాలరీత్యా జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవికి మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంటు భవనంలో పోలింగ్ ప్రక్రియ సాగనుండగా.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పక్షాల అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ముఖాముఖి పోటీ జరగనుంది. అభ్యర్థులిద్దరూ తమకు మద్దతు కోరుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఆయా పార్టీలు సోమవారం వేర్వేరుగా మాక్ పోలింగ్‌ను నిర్వహించాయి. ఉప రాష్ట్రపతి

- మిగతా2లో



## రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు 8.64 లక్షల కోట్లు

- 3 నెలల్లో రూ.23,883 కోట్లు పెరుగుదల
- రైతులకు రూ.41 వేల కోట్ల రుణాలు
- ఎంఎస్ఎంఈలకు 68వేల కోట్లు, ముద్ర రుణాలు 3,303 కోట్లు
- బ్యాంకర్ల కమిటీ భేటీలో ప్రకటన



## ప్రాణహిత-చేవెళ్ల డీపీఆర్ సవరించండి

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం
- మేడిగడ్డ పునరుద్ధరణ డిజైనర్‌గా ఐఐటీ రూర్కీ వద్దు
- సమ్మక్క సాగర్ పనుల వేగం పెంచండి: మంత్రి ఉత్తమ్



## స్వదేశీ మేళాకు పట్టం కట్టండి

- ట్రంప్ సుంకాల వేళ ఎన్‌డీఏ ఎంపీలకు మోదీ ఉద్బోధ
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్తగా ఓటేయాలని సూచన
- మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించండి
- జీఎస్టీ రేట్లు భారీగా తగ్గిన చక్కటి తరుణంలో స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని జనాన్ని తెలిసేలా చేయండి.

# రాబడుల పెంపునకు కమిటీలు వేయండి

- రాబడి మార్గాలపై కర్ణాటక, తమిళనాడులో అధ్యయనం చేయాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- ప్రాజెక్టుల్లో ఇసుక ఆదాయానికి మార్గం : ఉత్తమ్



**హైదరాబాద్**

రాష్ట్ర ఆదాయార్జన శాఖల్లో రాబడులు పెరిగేందుకు అధికారులతో కమిటీలు వేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. వనరుల సమీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం భట్టి అధ్యక్షతన సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖ రాబడిలో 4.7శాతం, గనుల శాఖలో 18.6శాతం రాబడి వృద్ధి కనిపిస్తోందన్నారు. ఇతర రాబడుల శాఖల్లో కాస్త మందగమనం ఉంటోందని, ఇందుకు కారణాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. రాబడుల శాఖల్లో ఆదాయ పెరుగుదలకు అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలు కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో రాబడి మార్గాలపై అధ్యయనం చేయాలన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ భారీ నీటి పారుదల ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, ఇసుక మేట వేస్తుందని తెలిపారు. ఈ ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు. మొదట ఒక ప్రాజెక్టులో

- మిగతా2లో

# మూసీ పునరుజ్జీవం.. చేసి చూపిస్తాం

-మొదటిపేజీ తరువాయి

పాపాలు పోవని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. 'ఒకాయన తాటి చెట్టులా పెరిగాడే కానీ.. మోకాలులోనూ మెదడు లేదు. కాళేశ్వరం నీళ్లు మల్లన్నసాగర్ నుంచి తీసుకుంటున్నారంటూ అర్థరహితంగా మాట్లాడుతున్నడు' అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును మీ తాత లేదా ముత్తాత కట్టారా? ప్రాణహిత– చేవేళ్ల ప్రాజెక్టులో మల్లన్నసాగర్ (ప్రతిపాదిత ప్రణాళికలోని తడ్కపల్లి చెరువును ఉద్దేశిస్తూ) లేదా? అని నిలదీశారు. కాసుల కక్కుర్తితో తుమ్మిడిహెట్టి దగ్గర నిర్మించాల్సిన బ్యారేజీని మేడిగడ్డలో నిర్మించడం ద్వారా రంగారెడ్డి జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందన్నారు. 'మహారాష్ట్ర సీఎంతో మాట్లాడుతున్నం.. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ కట్టేందుకు అనుమతి అడిగాం. త్వరలో అక్కడకు వెళ్తా. వాస్తవానికి 148మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టేందుకు గతంలోనే ఒప్పందం జరిగింది. మధ్యే మార్గంగా 149–150 మీటర్లు ఎత్తులో ప్రాజెక్టును నిర్మించి రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తాం" అని పేర్కొన్నారు. గోదావరి జలాలు తరలించడం ద్వారా చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రజలను ఆదుకుంటామన్నారు.

**పదేళ్లలో బీఆర్ఎసకు ఆ ఆలోచనే రాలేదు**

పదేళ్ల పాలనలో గోదావరి, కృష్ణా జలాలను హైదరాబాద్‌కు తరలించాలన్న ఆలోచనే చేయని ఘనత బీఆర్ఎసది అని ధ్వజమెత్తారు. "ఎన్నికలకు ముందు నల్లగొండలో ప్రచారానికి వెళ్లినప్పుడు.. అన్నా మూసీ నది మాకు విషం ఇస్తోందని అక్కడి ప్రజలు చెప్పారు. ఆనాడే వారికి మాట ఇచ్చా. అందుకే పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాం. తద్వారా హైదరాబాద్‌నూ సుందర నగరంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ఎవరు అడ్డం పడినా, ఒక్కొక్క అవాంతరాన్ని అధిగమించుకుంటూ వెళ్తామని స్పష్టం చేశారు. రూ.7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలను జంట జలాశయాలకు తీసుకువస్తున్నామని, ఇందులో 15, 16 టీఎంసీలు హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు, పరిసర ప్రాంతాల్లోని చెరువులు నింపేందుకు వినియోగిస్తామన్నారు. 4, 5 టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు వాడనున్నట్టు తెలిపారు. మురికి కూపంగా మారిన మూసీ నదిని అద్భుతంగా మార్చుకుందామా? వద్దా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. కాంగ్రెసకు మంచి పేరు వస్తుందనే కొందరు దుర్మార్గులు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 'రాజకీయంగా కోపం ఉంటే మాతో కొట్లాడండి. కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులను ఆపొద్దు. కలిసి రండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి' అని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. గేట్ వే ఆఫ్ హైదరాబాద్ కింద బుద్వేల్‌ను అద్భుతంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామని, మూడేళ్లలో ప్రపంచంతో పోటీ పడేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. వచ్చే వందేళ్లు రాష్ట్రం, హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేయాలన్న స్పష్టమైన ప్రణాళికతో తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ తీసుకొస్తున్నామని, డిసెంబరు 9న జాతికి అంకితం చేస్తామన్నారు. విపక్ష నేతలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలుగా అడ్డం పడినా ప్రభుత్వం తిప్పికొడుతుందని, ఒక్కొక్కరి సంగతి తేలుస్తుందని అన్నారు. 'ఇది ఇందిరమ్మ రాజ్యం.. పేదల రాజ్యం.. పేదలకు న్యాయం జరుగుతుంది' అని ఉద్ఘాటించారు.

**ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ ప్రారంభోత్సవం**

కోకాపేట వద్ద హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రంపెట్ ఇంటర్‌చేంజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌కు, ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ (ఎగ్జిట్ 1ఏ) వల్ల ఇటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అటు పటాన్‌చెరు వైపు చేరుకోవడం మరింత సులభతరం కానుంది.

**ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్**

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఇండియా కూటమి తరపున జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నిక అనంతరం సీఎం రేవంత్ పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని, రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరనున్నారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తరభాగానికి టెండర్లను ఆహ్వానించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేయనున్నారు. హైదరాబాద్–కరీంనగర్– రామగుండం మార్గంలో కొత్త అలైన్‌మెంట్‌ను ఆమోదించాలని, మెట్రో రెండో దశకు నిధులివ్వాలని కేంద్ర మంత్రులను కోరుకున్నారు.

# ప్రాణహిత-చేవెళ్ల డీపీఆర్ సవరించండి

హైదరాబాద్

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని, ఇందుకోసం తక్షణమే సవరణ డీపీఆర్‌ను సిద్ధం చేసి, అనుమతుల కోసం దాఖలు చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జలసౌధలో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో డిసెంబరు నాటికల్లా పనులను వేగిరం చేయాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాణహిత–చేవెళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం, చనకా కొరాటా, చిన్న కాళేశ్వరం(ముక్తేశ్వర్), మొడికుంటవాగు ప్రాజెక్టులకు టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) అనుమతులు లభించిన నేపథ్యంలో ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎసవై–ఏఐబీపీ) కింద సాయం కోసం అభ్యర్థించాలని ఆదేశించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్లు, పరీక్షలు ఎక్కడి దాకా వచ్చాయని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్(సీఈ)ను మంత్రి ప్రశ్నించారు. కొత్త బ్యారేజీల డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేయడానికి ఐఎస(భారతీయ ప్రమాణాల)కోడ్‌లు ఉన్నాయి కానీ.. బ్యారేజీలు కుంగినప్పుడు పునరుద్ధరణకు ఏం చేయాలన్న దానిపై కోడ్‌లు లేకపోవడంతో డిజైన్లు తయారు చేయలేకపోతున్నామని ఆయన పేర్కొన్నారు. దీంతో ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్ల తయారీ బాధ్యత నుంచి తప్పించుకోలేరని స్పష్టంచేశారు. అలాగే, బ్యారేజీల పునరుద్ధరణ డిజైనర్‌గా ఐఐటీ రూర్కీని నియమించాలన్న ప్రతిపాదన రాగా... బ్యారేజీలు నిర్మించిన సమయంలో కన్సల్టెంట్‌గా ఐఐటీ రూర్కీ ఉందని, ఇప్పుడు ఆ సంస్థ సేవలు అక్కర్లేదని మంత్రి తేల్చిచెప్పారు. దీనికి బదులుగా ఐఐటీ మద్రాసు వంటి పురాతన విద్యాసంస్థల సేవలు తీసుకోవాలని, వారిచ్చే డిజైన్లకు చట్టబద్ధత కల్పించాల్సింది సీడీవో సీఈనేనని తేల్చిచెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉద్దండపూర్ వద్ద భూసేకరణ సమస్యలు ఉన్నాయని అధికారులు పేర్కొనగా... త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. కొడంగల్–నారాయణపేట, డిండి ఎత్తిపోతల పథకం, పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్ల పనుల కోసం సత్వరమే భూసేకరణ చేపట్టాలన్నారు. ఎన్‌డీఎసఏ



నివేదిక ప్రకారం జూరాల ప్రాజెక్టు కట్టపై వాహనాల రాకపోకల నియంత్రణకు దిగువన ప్రత్యామ్నాయంగా బ్యారేజీ కమ్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. వచ్చే మంత్రివర్గ సమావేశం నాటికి దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజీ–3, 6కింద పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణలో భాగంగా హెలిబోర్న్ సర్వేకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయని, తక్షణమే ఏరియల్ మ్యాగ్నటిక్ సర్వే చేపట్టాలని సూచించారు.

**సమ్మక్కసాగర్‌కు ఎన్వోసీ కోసం ఛత్తీసగఢ్‌కు**

సమ్మక్కసాగర్ ప్రాజెక్టు(తుపాకులగూడెం బ్యారేజీ)కు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రంగంలోకి దిగారు. బుధవారం ఆయన ఛత్తీసగఢ్ వెళ్లనున్నారు. ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయిని నేరుగా కలిసి ఎన్వోసీ జారీ చేయాలని మంత్రి కోరనున్నారు. ఈనెల 23న సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించనుంది. ఈలోగా ఛత్తీసగఢ్ నుంచి ఎన్వోసీ వస్తే ప్రాజెక్టు గట్టెక్కే అవకాశాలుండటంతో మంత్రి ఉత్తమ్ రంగంలోకి

# రాజకీయ యుద్ధాలకు కోర్టును వాడుకోవద్దు

న్యూఢిల్లీ

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ తెలంగాణ శాఖ దాఖలు చేసిన పరువునష్టం పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె. వినోద్‌చంద్రన్, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం బీజేపీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'రాజకీయ యుద్ధాలకు ఈ కోర్టును ఉపయోగించుకోవద్దని పదేపదే చెబుతున్నాం'అంటూ సీజేఐ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంలో జోక్యం చేసుకోదలచుకోలేదని తేల్చిచెప్పారు. రాజ కీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు తట్టుకొనే శక్తి ఉండాలని పేర్కొంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలని హితవు పలికారు. అయినా రంజిత్ కుమార్ వాదనలు కొనసాగించేందుకు ప్రయత్నించడంతో సీజేఐ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'మేం ఇప్పటికే పిటిషన్‌ను కొట్టేశాం. ఇంకా వాదనలు దేనికి? మళ్లీ ఇలాంటి పిటిషన్‌తో కోర్టుకు వస్తే రూ. 10 లక్షల జరిమానా విధిస్తాం'అంటూ హెచ్చరించారు.

**ఇదీ నేపథ్యం..**

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతేడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు తమ పార్టీకి రాజకీయంగా పరువునష్టం కలిగించాయంటూ బీజేపీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి



కాసం వెంకటేశ్వర్లు హైదరాబాద్ ట్రయల్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. కేసులో ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారించి ఐపీసీ సెక్షన్ 499, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125 కింద విచారణకు ఆదేశించింది. ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. 'రాజకీయ ప్రసంగాలు తరచుగా అతిశయోక్తులతో నిండి ఉంటాయి. వాటిని పరువునష్టంగా పరిగణించడం సరికాదు'అని వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన హైకోర్టు.. ట్రయల్ కోర్టు ఆదేశాలను రద్దు చేస్తూ రేవంత్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు.

## రాబడుల పెంపునకు కమిటీలు వేయండి

-మొదటిపేజీ తరువాయి

పూడికతీతను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం పనులను పూర్తిగా గిరిజన ఏజెన్సీలకు ఇవ్వాలన్నారు. గిరిజనులకు యంత్ర సామగ్రి అందుబాటులో ఉండదని, ఈ దృష్ట్యా ఐటీడీఏల్లోని ఇంజనీరింగ్ విభాగం యంత్ర సామగ్రిని సమకూర్చాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధివిధానాలను రూపొందించాలని మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీపకుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

**ఆ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్**

రాష్ట్ర ఆదాయార్జన శాఖలైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖల్లోని ఉద్యోగులు, అధికారుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీపకుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదాయార్జన శాఖల్లో బదిలీలకు గతంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని ఉన్నతాధికారులకు సూచించారు.

## రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు 8.64 లక్షల కోట్లు

హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో (ఏప్రిల్–జూన్) రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు రూ.23,883 కోట్లు పెరిగి రూ.8,64,312 కోట్లకు చేరాయి. అలాగే అడ్వాన్సులు రూ.12,021 కోట్లు పెరిగి రూ.10,93,382 కోట్లకు చేరుకున్నాయి. ఎస్ఎల్‌బీసీ సమావేశం సందర్భంగా తొలి త్రైమాసికంలో డిపాజిట్లు, రుణాల వివరాలను బ్యాంకర్లు ప్రకటించారు. ఈ త్రైమాసికంలో వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రజలకు పంపిణీ చేసిన వివరాలను కూడా బ్యాంకర్ల కమిటీ ప్రకటించింది. తొలి మూడు నెలల్లో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలుగా రూ.17,577 కోట్లు అందివ్వగా.. మొత్తం లక్ష్యంలో ఇది 32.73 శాతంగా ఉంది. అలాగే వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెట్టుబడి రుణాల కింద రూ.23,473 కోట్లు ఇవ్వగా.. మొత్తం లక్ష్యంలో ఇది 30.93 శాతం. ప్రాధాన్యత రంగాల కింద గృహ రుణాలకు రూ.1,407 కోట్లు, ఉన్నత విద్యకు రూ.110 కోట్లు విడుదల చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎసఎంఈ) రూ.68,033 కోట్లు, వ్యాపారస్తులకు ముద్ర రుణాలు రూ.3,303 కోట్లు ఇచ్చారు. వ్యవసాయ మౌలికవసతుల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా రూ.3,645 కోట్లు మంజూరు చేశారు. సామాజిక భద్రత పథకంలో భాగంగా.. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకంలో 1.97 కోట్ల మందికి జీవిత బీమా కల్పిస్తున్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన 95.48 లక్షల మందికి అమల్లో ఉంది. అలాగే 24.21 లక్షల మంది అటల్ పెన్షన్ యోజన కింద రక్షణ పొందుతున్నారు.

## మేడారం పనులు వంద రోజుల్లో పూర్తి కావాలి



హైదరాబాద్/ములుగు

మేడారంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జంపన్న వాగులో నీరు నిలిచేలా ప్రాంతాల వారీగా ఎక్కడికక్కడ చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ వారంలో తానే స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తానని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మేడారం అభివృద్ధికి సంబందించిన డిజైన్లను పరిశీలించిన సీఎం.. పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ వసతులు ఉండాలని సూచించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్‌ను గౌరవించడంతోపాటు నిపుణులు, పూజారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ పాల్గొన్నారు.

**మాస్టర్‌ప్లాన్ వివరాలు సిద్ధం చేసుకోండి**

**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చేవారం మేడారంలో పర్యటించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మేడారం సమ్మక్క–సారలమ్మల జాతర ఏర్పాట్లతో పాటు మాస్టర్‌ప్లాన్‌లో నిర్ణయించిన అభివృద్ధి పనులను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని చెప్పారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ వివరాలు, అభివృద్ధి పనుల ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయ ఆధునికీకరిస్తామని అన్నారు. సెప్టెంబరు 15 నుంచి పనులు ప్రారంభించి, జనవరి మొదటి వారంలోగా పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌ను సీఎం రేవంత్ పరిశీలించారని, మూడు నెలల వ్యవధిలో పనులు పూర్తవ్వాలని ఆదేశించారని పేర్కొన్నారు. మేడారం జాతరకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని వివరించారు.

## ఒడిశా ఎమ్మెల్యే రాజేంద్ర ధోలకియా కన్నుమూత

భువనేశ్వర్



ఒడిశాలోని నువాపడ జిల్లా కేంద్రం ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాజేంద్ర ధోలకియా (69) సోమవారం చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇటీవల ఆయనకు గుండె మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. ఆయన నువాపడ ఎన్ఏసీ అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా నువాపడ నుంచి పోటీ చేసి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తర్వాత బిజదలో చేరిన రాజేంద్ర 2014, 2019, 2024 ఎన్నికల్లో అదే స్థానం నుంచి వరుస విజయాలు సాధించారు. 2019 నుంచి 2024 వరకు నవీన్ పట్నాయక్ మంత్రివర్గంలో ప్రణాళికా, సమన్వయ శాఖమంత్రిగా పనిచేశారు.

# గుర్తింపు కార్డుగా ఆధార్

న్యూఢిల్లీ

బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్‌ఐఆర్) అంశంలో ఆధార్ గుర్తింపు కోసం పోరాడుతున్న విపక్ష పార్టీలకు అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానంలో ఉత్తర్వులొచ్చాయి. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు కార్డ్‌గా ఆధార్‌నూ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం సూచించింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ధృవీకరణ పత్రాల జాబితాలో 12వ గుర్తింపు డాక్యుమెంట్‌గా ఆధార్‌ను పరిగణించాలని ఈసీని న్యాయస్థానం ఆదేశించింది. "బిహార్ కొనసాగుతున్న ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ఓటర్ గుర్తింపు విషయంలో ఆధార్‌నూ అనుమతించండి. అయితే ఆ ఆధార్ అనేది పౌరసత్వ గుర్తింపునకు రుజువుగా భావించాలని మేం చెప్పట్లేదు. ఎస్‌ఐఆర్‌లో ఇకపై ఆధార్‌ను సైతం అంగీకరిస్తున్నట్లు స్పష్టంగా పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల అధికారులకు మీరు అవసరమైన ఆదేశాలను జారీచేయండి. మా ఆదేశాలను సెప్టెంబర్ 9వ తేదీలోపు అమలుచేయండి"అని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. "అక్రమ వలసదారుల పేర్లు ఓటర్ల జాబితాలో కలపాలని ఎవరూ కోరుకోరు. కేవలం నిజమైన భారతీయ పౌరులను మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించాలి. తప్పుడు డాక్యుమెంట్లను సమర్పించిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలి"అని కోర్టు వ్యాఖ్యానించింది. ఓటర్ల ఆధార్ కార్డ్‌ను ఎందుకు ఆమోదించట్లేదో సంజాయిషీ ఇవ్వాలని గతంలో ఆదేశించిన నేపథ్యంలో ఈసీ ఇచ్చిన వివరణను కోర్టు సోమవారం ఆలకించింది.

ఈ సందర్భంగా ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. "ముసాయిదా జాబితాలోని 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.6 శాతం మంది తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో చేర్చాలంటూ సంబంధిత డాక్యుమెంట్లను ఇప్పటికే సమర్పించారు. ఇక 12వ ధృవీకరణ పత్రంగా ఆధార్‌ను అనుమతించాలంటూ పలువురు పిటిషన్లు ఇచ్చారు. అయితే ఇందులో ఆధార్‌ను ఒక రుజువుగా అంగీకరిస్తామని ఈసీ గతంలోనే పేర్కొంది. అయినాసరే ఆధార్‌ను కచ్చితంగా 12వ ధ్రువీకరణ పత్రంగా చేర్చాలని కోరడంలో అర్థంలేదు"అని ఆయన వాదించారు. దీంతో ధర్మాసనం జోక్యంచేసుకుంది. "ప్రజాప్రతినిధుల చట్టం%–%1950లోని 23(4) సెక్షన్, ఆధార్ చట్టం%–%2016లోని నియమ,నిబంధనల ప్రకారమే ఓటరు గుర్తింపు కోసం ఆధార్‌ను పరిగణించవచ్చని నిర్ధారించాం. అయితే ఆధార్ అనేది పౌరసత్వాన్ని రుజువుచేయబోదు"అని ధర్మాసనం స్పష్టంచేసింది.

**ఎస్‌ఐఆర్‌పై తగ్గుతున్న నమ్మకం!**

"ఎస్‌ఐఆర్ క్రతువుపై పిటిషన్‌దారులు, విపక్షాల్లో నమ్మకం తగ్గుతున్నట్లుగా తోస్తోంది. ఈ నమ్మకాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ రంగంలోకి దిగాలి. రాజకీయ పార్టీలు, ఓటర్లకు పారాలీగల్ వలంటీర్లు సాయపడాలి. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులపై చేసే దరఖాస్తుల విషయంలో వలంటీర్లు సాయం అందించాలి"అని కోర్టు ఆదేశించింది. తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 30వ తేదీన ముద్రించనున్నారు.

**ఈసీ సిగ్గుపడాలి: కాంగ్రెస్**

సుప్రీంకోర్టు ఎన్నిసార్లు ఆదేశించినా ఆధార్‌ను ధృవీకరణ జాబితాలో చేర్చకుండా నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్న ఈసీ సిగ్గుపడాలని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సోమవారం తన సామాజికమాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఓటర్ల నమోదుకోసం ఆధార్‌నూ గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోర్టు ఇప్పటికి మూడుసార్లు ఆదేశించింది. అయినా కోర్టు ఆదేశాలను ఈసీ పెడచెవినపెట్టింది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఈసీ ఈ విషయంలో సిగ్గుపడాలి. విపక్ష రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లనూ ఈసీ గుర్తించట్లేదు. ఇవన్నీ ఈసీ సారథి సొంత నిర్ణయాల్లా కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను, కేంద్ర ఎన్నికల సంఘాన్ని చరిత్ర క్షమించదు"అని ఆయన అన్నారు.

# స్వదేశీ మేళాకు పట్టం కట్టండి

న్యూఢిల్లీ

స్నేహితుడు, శత్రువు అనే బేధం లేకుండా అమెరికా ప్రభుత్వం అందరిపై సుంకాలతో బాదేస్తున్న వేళ ప్రధాని మోదీ స్వదేశీరాగం అందుకున్నారు. విదేశీ వస్తువులపై మోజు తగ్గించుకుని స్వదేశీ వస్తువులకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో సోమవారం ఎన్‌డీఏ కూటమి ఎంపీలతో సమావేశంలో పలు అంశాలపై ప్రధాని మాట్లాడారు. "దేశవాళీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగేలా చూడండి. స్వదేశీ మేళాను ఉద్యమస్థాయికి తీసుకెళ్లండి. విదేశాల అధిక టారిఫ్‌ల వంటి ప్రతికూలతలు, సవాళ్ల సమయంలో భారత్ స్వావలంబన ద్వారా తన శక్తిసామర్థ్యాలను మరింతగా సంతరించుకోవాల్సిన తరుణమిది. మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించండి. జీఎస్టీ రేట్లు భారీగా తగ్గిన చక్కటి తరుణంలో స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని జనాన్ని తెలిసేలా చేయండి. ముఖ్యంగా నవరాత్రి, దీపావళి వంటి పండుగల సీజన్‌లో మీమీ నియోజకవర్గాల్లో ప్రజలతో, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటుచేసి తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలను వివరించండి"అని మోదీ అన్నారు. మోదీ ప్రసంగ వివరాలను తర్వాత కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు మీడియాకు వివరించారు. అమెరికా 50 శాతం టారిఫ్ భారం మోపిన వేళ మోదీ స్వదేశీ వస్తువుల ప్రాశస్త్యాన్ని ప్రస్తావించడం గమనార్హం.



**శక్తివంతమయ్యేవేళ సవాళ్లు సాధారణం**

"భారత్ శక్తివంతంగా ఎదిగే క్రమంలో సవాళ్లు ఎదురవడం సాధారణం. అయినాసరే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే క్రమంలో ఇలాటి సవాళ్లను ఎదుర్కొంటూ ఆత్మనిర్భర్‌ను సాధించాలి. సొంత నియోజకవర్గాల్లో దేశీయ ఉత్పత్తుల ప్రచారాన్ని మీరే నాయకులుగా ముందుండి నడపాలి. గతంలో భారత్‌లో జపాన్ తయారీ వస్తువుల వినియోగం అధికంగా ఉండేది. అలాంటి భారత్‌లో ఇప్పుడు దేశీయోత్పత్తులను అధికంగా ఉపయోగించగల్గుతున్నామని గర్వపడేలా మనం చేయాలి. మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో స్వదేశీ ఉత్పత్తులు కనిపించాలి. ఉపయోగించాలి"అని ఎంపీలకు మోదీ సూచించారు. "జీఎస్‌టీ శ్లాబుల తొలగింపు అనేది ప్రజల్లో పెను సంచలనంగా మారింది. ప్రజలతో 'స్వదేశీ మేళాలు', వ్యాపారులతో 'వ్యాపారీ సమ్మేళన్'లు నిర్వహించండి. గాల్లో తుపాను చెలరేగినాసరే మనం వాహన టైరులో మళ్లీ గాలి కొట్టాల్సిందే. అలాగే దేశీయంగా 'స్వదేశీ వాతావరణం'ఉన్నాసరే మన మళ్లీ విడిగా మన వంతు తోడ్పాటు అందించాల్సిందే"అని అన్నారు.

**ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్త**

"ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసేటప్పుడు ఎంపీలు జాగ్రత్త వహించండి. తప్పులు దొర్లకుండా ఓటేయండి. పార్లమెంట్ సభ్యులే ఓటింగ్‌లో తప్పులు చేస్తే ప్రజలకు తప్పుడు సందేశం వెళ్తుంది. మన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ దేశవ్యాప్తంగా అన్ని వర్గాల్లో ఉత్తమ అభ్యర్థిగా పేరుతెచ్చుకున్నారు. ఆయన ఉపరాష్ట్రపతిగా చక్కటి సేవలు అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. తన పాలనాదక్షతతో ఆయ ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తేగలరని నేనూ విశ్వసిస్తున్నా"అని అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ఆమోదం పొందం వెనుక అధికార కూటమి ఎంపీల కృషిదాగి ఉందని మోదీ ప్రశంసించారు.

**హిమాచల్, పంజాబ్‌కు నేడు మోదీ**

వరద విలయంలో చిక్కుకుని అల్లాడిపోతున్న హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో తాజా పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని మోదీ మంగళవారం పర్యటించనున్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకూ మోదీ వెళ్లి అక్కడి బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారు. హిమాచల్‌లోని కంగ్రాకు మోదీ వెళ్లనున్నారు. అక్కడే ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

# అంతటా అపరిశుభ్రత, దుర్గంధం

హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ కస్తూర్బా బాలికల విద్యాలయాలను వరద కష్టాలు వెంటాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కేజీబీవీ ప్రాంగణాలు బురదమయం కావడంతో పరిసరాలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షాలకు గదుల గోడల్లోకి చెమ్మ చేరింది. కప్పుకునే దుప్పట్లే కాదు... వేసుకునే దుస్తులు కూడా తడిసిపోయి వాసన వస్తున్నాయి. అపరిశుభ్రత వల్ల దోమలు వ్యాపిస్తుండటం వల్ల విద్యార్థినులు దోమకాట్లతో అస్వస్థతకు గురవుతున్నారు. అధికారులు జోక్యం చేసుకున్నా ఇప్పటికిప్పుడు పరిస్థితి మెరుగవ్వడం కష్టంగా కనిపిస్తోంది.

**పరిశుభ్రత లోపించి అనారోగ్యం..**

రాష్ట్రంలో 495 కేజీబీవీ పాఠశాలలు ఉండగా 403 కేజీబీవీలను ఇంటర్ వరకూ ఉన్నతీకరించారు. కేజీబీవీల్లో 1,24,153 మంది విద్యార్థులు చదువుతున్నారు. టెన్త్ వరకూ దాదాపు లక్ష మంది విద్యార్థులు ఉన్నారు. సమగ్ర శిక్ష పర్యవేక్షణలో సాగే కేజీబీవీల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఇటీవల క్షేత్రస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కరీంనగర్ ప్రాంతంలోని ఓ కేజీబీవీలో విద్యార్థులు దగ్గు, శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నారు. సమీపంలోనే డంపింగ్ యార్డ్ ఉండటం, ఇటీవల వర్షాలకు ఇది దుర్గంధం వెదజల్లడం కారణమని గుర్తించారు. కొన్ని నెలలుగా మహబూబ్‌బాద్ జిల్లాల్లో 36 మంది, నిజామాబాద్ జిల్లాల్లో 90 మంది, వనపర్తిలో 50 మంది విషాహారంతో అస్వస్థతకు గురైన ఘటనలు నమోదయ్యాయి. పరిసరాల పరిశుభ్రత లోపించడం వల్లే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తించారు. ఖమ్మం జిల్లా మారుమూల ప్రాంతంలోని కేజీబీవీల్లో వర్షపు నీరు చేరి ప్రాంగణమంతా బురదగా మారింది. భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు పెరిగాయి. వ్యాధుల బారిన పడుతున్నారు.

**అర్వపల్లిలో అరణ్య రోదన...**

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి కేజీబీవీ చినుకుపడితే జలమయమవుతోంది. ఇక్కడ 300 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం సమీపంలో చేపట్టిన కాల్వ నిర్మాణం వల్ల నీరు కేజీబీవీ వద్దే నిలిచిపోతోంది. కాస్త పెద్ద వర్షం పడితే విద్యాలయానికి సెలవు ప్రకటించాల్సిందే. వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్న మొర వినిపించుకొనే నాథుడే లేడని స్థానికులు అంటున్నారు.

**మంగపేట మూగ వేదన..**

ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని కేజీబీవీలో 170 మంది చదువుతున్నారు. ఇక్కడ కొత్త భవనమే ఉన్నా ప్రహరీ లేదు. పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. భోజన వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. పందుల వల్ల దోమలు పెరుగుతున్నాయి. మురుగునీరు బయటకు వెళ్లలేక దుర్వాసన వస్తోంది. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని కేజీబీవీ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి.

**గండీడ్‌లో ఘోష**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో కొత్తగా ఏర్పాటైన కేజీబీవీ అద్దె భవనంలో నడుస్తోంది. 188 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఇటీవల వర్షాలకు నీరు నిలిచి ప్రాంగణమంతా బురదమయమైంది. దీంతో దోమలు వ్యాపించి సుమారు 40 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇళ్లకు వెళ్లిపోయారు. అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

**రాజన్నా... సమస్యలేంటన్నా!**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 కేజీబీవీలన్నీ పట్టణాలకు దూరంగా ఉన్నాయి. దీంతో రక్షణ కరువైందని విద్యార్థినులు అంటున్నారు. ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీకి వెళ్లే రోడ్డు సరిగ్గా లేక రాకపోకలకు వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే ట్రాక్టర్‌పై వెళ్లాల్సి వస్తోంది. అనారోగ్య సమస్యలు వస్తే తక్షణ వైద్య సదుపాయానికి నరకయాతన పడాల్సి వస్తోంది. అధికారులు తక్షణమే స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ..

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికకు సంబంధించిన ఓటింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. పార్లమెంట్ హౌస్ వసుధలోని రూమ్ నంబర్ ఎఫ్%–%101లో పోలింగ్ జరగనుంది. 6 గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితం వెల్లడి కానుంది. ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు (ప్రస్తుతం ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి), రాజ్యసభకు నామినేటెడ్ అయిన 12 మంది, లోక్‌సభ ఎంపీలు 543 మంది (ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది) ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్నారు.

**ఎన్డీఏకు సొంతంగా 422 మంది సభ్యుల బలం**

ఎలక్టోరల్ కాలేజీలోని బలాబలాల పరంగా చూస్తే ఎన్డీఏకు స్పష్టమైన మెజార్టీ ఉంది. ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 781 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం 542 మంది సభ్యులున్న లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి 293 మంది సభ్యుల బలం ఉంది. ఇక 239 మంది సభ్యులున్న రాజ్యసభలో పాలక కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉంది. విజయానికి అవసరమైన ఓట్లు 391 కాగా, ఎన్డీఏకు సొంతంగానే 422 మంది సభ్యుల బలం ఉంది. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం తమ 11 మంది సభ్యుల మద్దతు ఎన్డీఏ అభ్యర్థికి ప్రకటించడంతో ఆ సంఖ్య 433కి చేరనుంది. ఇక విపక్ష ఇండియా కూటమికి రెండుసభల్లో కలిపి 311 ఓట్లు ఉండగా, ఈ కూటమికి ఆప్ మద్దతు ప్రకటించింది. దీంతో కూటమి బలం 320 మాత్రమే దాటుతోంది. అయితే రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలో ఎంపీలు తమ పార్టీల విప్‌ను పాటించాల్సిన అవసరం లేదు.

**అన్ని పార్టీల మాక్ పోలింగ్..**

పార్టీల బలాబలాలపై ఇరు పక్షాలకు స్పష్టత ఉన్నప్పటికీ ఓట్లు చెల్లుబాటు కాకుండా పోవడంపై ఆందోళన, క్రాస్ ఓటింగ్ భయం రెండు కూటముల్లోనూ కనిపిస్తోంది. 2022 ఎన్నికల్లో 15 ఓట్లు చెల్లకుండా పోవడంతో ఈసారి పార్టీలు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ తమ ఎంపీల కోసం ఆది, సోమవారాల్లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ పాత పార్లమెంట్ భవనం సెంట్రల్‌హాల్‌లో మాక్ పోలింగ్ ద్వారా తమ ఎంపీలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విపక్ష ఎంపీలకు విందు ఇచ్చారు. సంవిధాన్ సదన్‌లో జరిగిన సమావేశంలో ఖర్గేతో పాటు సోనియాగాంధీ, శరద్‌పవార్, టీఆర్ బాలు, అఖిలేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైతం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఎంపీలతో మాక్ పోలింగ్ నిర్వహించింది.

**ఎన్డీఏ ఎంపీలతో మోదీ సమావేశం**

మంగళవారం ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం..'రాధాకృష్ణన్ అద్భుతమైన ఉప రాష్ట్రపతి అవుతారని ప్రజలు విశ్వసిస్తున్నారు..'అంటూ 'ఎక్స్'లో ఒక పోస్టు చేశారు. కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ మచ్చలేని నేతగా అభివర్ణిస్తోంది. రాజకీయ, పాలనాపరమైన ఆయన విశేష అనుభవం..రాజ్యసభ చైర్మన్‌గా విధులు నిర్వర్తించేందుకు ఉపకరిస్తుందని పేర్కొంటోంది. ఇక విపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి 2011లో సుప్రీంకోర్టులో పదవీ విరమణ పొందారు. నల్లధనం, సల్వాజుడుం తదితర కేసుల్లో కీలక తీర్పులు వెలువరించారు.

**బీఆర్ఎస్, బీజేడీ దూరం**

రెండు కూటములకు సమాన దూరాన్ని పాటిస్తూ వస్తున్న బీఆర్ఎస్, బీజేడీలు ప్రస్తుత ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉంటామని ఇప్పటికే ప్రకటించాయి. ప్రస్తుతం రాజ్యసభలో బీఆర్ఎస్‌కు నలుగురు, బీజేడీకి ఏడుగురు సభ్యుల బలం ఉంది.

## ఓ ప్రత్యేక ప్రక్రియ




న్యూఢిల్లీ

కేవలం పార్లమెంటు సభ్యులు మాత్రమే పాల్గొనే ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రత్యేకమైనది. 'నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం'లో 'ఏక బదిలీ ఓటు' పద్ధతి ద్వారా ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. అంటే ప్రతి ఎంపీ బ్యాలెట్ పత్రంపై ఉన్న అభ్యర్థులకు తమ ప్రాధాన్యత క్రమాన్ని కేటాయించాల్సి ఉంటుంది. బ్యాలెట్ పత్రాలపై ఇద్దరు అభ్యర్థుల పేర్లు ఉంటాయి. ఎంపీలు తమకు ఇష్టమైన అభ్యర్థి పేరు పక్కన '1' అని రాయడం ద్వారా తమ మొదటి ప్రాధాన్యతను సూచించాలి. ఈ అంకెను భారతీయ సంఖ్యలలో, రోమన్ సంఖ్యలలో లేదా ఏదైనా భారతీయ భాషలోని సంఖ్యలలో రాయవచ్చు, కానీ అక్షర రూపంలో రాయకూడదు.

**సంక్లిష్టమైన లెక్కింపులు ఉండవు**

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రపతి ఎన్నికల్లా ఓటు విలువలో సంక్లిష్టమైన లెక్కింపులు ఉండవు. ఈ ఎన్నికల్లో పాల్గొనే ప్రతి ఎంపీ ఓటు విలువ 'ఒకటి' (1) గానే పరిగణిస్తారు. గెలవడానికి అభ్యర్థి మొత్తం చెల్లుబాటైన ఓట్లలో 50% కంటే ఎక్కువగా (కోటా) మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించాల్సి ఉంటుంది. ఒకవేళ మొదటి రౌండ్‌లో ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాకపోతే, తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీ నుంచి తొలగించి, వారి రెండవ ప్రాధాన్యత ఓట్లను మిగతా అభ్యర్థులకు బదిలీ చేస్తారు.

**పోటీ ఉంటేనే పోలింగ్**

భారత రాజ్యాంగం ప్రకారం, ఉప రాష్ట్రపతి పదవీకాలం ఐదేళ్లు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి పదవీకాలం ముగిసేలోపు కొత్తవారిని ఎన్నుకోవడం రాజ్యాంగ బద్ధమైన విధి. ఒకవేళ అధికార, విపక్ష కూటముల మధ్య ఏకాభిప్రాయం కుదిరి, ఒక్కరే అభ్యర్థి బరిలో ఉంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. కానీ ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పుడు విజేతను నిర్ణయించడానికి పోలింగ్ తప్పనిసరి.

**రహస్య పద్ధతిలో ఎందుకు?**

ఉప రాష్ట్రపతి ఎన్నికను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించడానికి బలమైన రాజ్యాంగ పరమైన కారణాలు ఉన్నాయి. ఎంపీలు ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు, పార్టీ విప్‌లకు లొంగకుండా తమ అంతరాత్మ ప్రబోధం మేరకు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. రాజకీయాలకు అతీతంగా సభ్యులు తమ ప్రతినిధిని ఎన్నుకోవాలన్నదే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం. ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పత్రాన్ని పార్టీ ఏజెంట్లతో సహా ఎవరికీ చూపించడానికి వీల్లేదు.

# విద్యార్థుల విద్యతో పాటు క్రీడలో రాణించాలి

-ఎస్.జి.ఎఫ్ క్రీడల్లో ఎంజేపీటీ విద్యార్థుల విజయకేతనం..
-కృషి,పట్టుదల ఉంటే సాధించలేనిదేమీ లేదు...
-ప్రిన్సిపల్ సుధాకర్,ఏటీపీ షబానా బేగం





**చౌటుప్పల్. సెప్టెంబర్ 08. ప్రభాత సూర్య :** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. గౌలిపురాలోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఎస్ జి ఎఫ్ 69 వ ఇంటర్ స్కూల్ చార్మినార్, ముషీరాబాద్ మండల అండర్ 14,17 బాలుర క్రీడా పోటీలను నిర్వహించారు. చౌటుప్పల్ మండలం,తూప్రాన్ పేట పరిధిలోని నేతాజీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎం జె పి టి పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎస్ జి ఎఫ్ చే నిర్వహించబడిన క్రీడల్లో పాల్గొని పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ అభినందించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ప్రిన్సిపల్ అభినందించారు. గౌలిపుర ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ 69 ఇంటర్నేషనల్ స్కూల్ చార్మినార్ మండల అండర్ 14 -17 బాలుర విభాగంలో 2025 -26 అండర్14 ఖోఖో మొదటి స్థానం, అండర్ 14 కబడ్డీ లో మొదటి స్థానం, అండర్ 17 బాలుర విభాగంలో ఖో ఖో మొదటి స్థానం, అండర్ 17 కబడ్డీ తృతీయ స్థానం సాధించారని, అలాగే ముషీరాబాద్ మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడలో అండర్ 14 ఖోఖో బాలుర విభాగంలో మొదటి స్థానం, అండర్ 14 కబడ్డీలో మొదటి స్థానం, అండర్ 17 ఖోఖో లో మొదటి స్థానం, అండర్ 17 కబడ్డీ లో ద్వితీయా తీయ స్థానంలో విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యత సాధించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వలన విద్యార్థులకు మానసిక వికాసం సిద్ధిస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.కృషి పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కిన్నెర వెంకటరావు, గౌర వెంకటేష్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏటిపి షబానా బేగం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అందుతున్న ఇందిరమ్మ ఇండ్లు



ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి





**పెబ్బేరు. సెప్టెంబర్ 8 ( ప్రభాత సూర్య )** పెబ్బేరు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభాలు నిర్వహించారు. కంచిరావుపల్లి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. తండాలోని ఆలయ నిర్మాణానికి ఆయన తన సొంత నిధులు రూ. 2లక్షలను విరాళంగా అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తండాకు బీటి రోడ్డు నిర్మాణం గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఆలయ నిర్మాణంతోపాటు ప్రభుత్వ పథకాల భాగంగా రేషన్ కార్డులు రేషన్ బియ్యం ఇందిరమ్మ ఇండ్ల లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టేమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం పెబ్బేరు మండల కేంద్రంలోనీ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 45 లక్షల ఖర్చుతో తరగతి గదుల బలోపేతంతో పాటు డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు.అనంతరం పెబ్బేరు మండల పరిషత్ ఆవరణలో ప్లాస్టిక్ వేస్టేజ్ వేరియేషన్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం ఇందిరమ్మ మోడల్ హౌస్ ను ప్రారంభించారు.నియోజకవర్గంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ లను నిర్మించిన 5మంది భవన నిర్మాణ కార్మికుల దంపతులకు శాలువాలతో సన్మానించి నూతన వస్త్రాలను అందజేసి సత్కరించారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం 650 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పాత సూగూరు గ్రామంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రారంభించి కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించారు. అనంతరం పెంచికలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వనపర్తి నియోజకవర్గంలో నేటికీ 1759 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. విద్య వైద్యంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు రేషన్ బియ్యం లాంటి పథకాలు రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధిని ఇంతకింత పెరిగేలా చేసుకోవాలని ఆయన నాయకులకు కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వనపర్తి హౌసింగ్ డిఇ విటోబా, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు, నాయకులు రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, దయాకర్ రెడ్డి,శ్రీ రంగాపురం మండల నాయకులు శ్రీహరి రాజు, వెంకటరమణ, వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, పట్టణ మాజీ కౌన్సిలర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేత

-విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే....
-చౌటుప్పల్ ఆర్డీవో వి శేఖర్ రెడ్డి, ఎంపీడీవో సందీప్ కుమార్,
-చౌటుప్పల్ మండల విద్యాధికారి గురువారావు





**చౌటుప్పల్. సెప్టెంబర్ 8. ప్రభాత సూర్య :** చౌటుప్పల్. సెప్టెంబర్ 8. ప్రభాత సూర్య: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే నని చౌటుప్పల్ ఆర్డీవో వి శేఖర్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం ను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఎంపీడీవో సందీప్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార అవార్డు కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి,మండల విద్యాధికారి గురువారావు, నక్క వెంకటమ్మ, నక్క యాదగిరి స్వామి ఆధ్వర్యంలో నడిచే ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సొసైటీ పక్షాన మాజీ ఎంఈఓ, మాజీ ఎఫ్ ఎల్ ఎన్ అధికారి నర్సింగ్ రావు , చౌటుప్పల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శివకుమార్ , నేలపట్ల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బత్తుల గిరిబాబు , పంతంగి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సత్యనారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జడ్.పి.హెచ్ చిన్న కొండూరు స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ జమీల బేగం , జడ్.పి.హెచ్.ఎస్ దేవలమ్మ నాగారం స్కూల్ అసిస్టెంట్ తెలుగు వాస అంజయ్య , ప్రాథమిక పాఠశాల కొయ్యలగూడెం పి సుజాత , జడ్.పి.హెచ్.ఎస్ పీపుల్పాడు స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ చేరుపెల్లి పద్మ, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్స్, కేజీబీవీ మేడం, వివిధ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను ఈ అవార్డుకు ఎంపిక చేసి అవార్డులు అందజేశారు . ఈ సందర్భంగా ఆర్డిఓ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ... యాదాద్రి జిల్లా కలెక్టర్ విద్య అభివృద్ధికి చేపట్టినటువంటి పల్లె నిద్ర కార్యక్రమం,వసతి గృహనిద్ర కార్యక్రమం విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని దాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులంతా విశేష కృషి చేయాలని తెలిపారు. ఎంపీడీవో ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదని అందరూ బాగా కష్టపడి పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు . అనంతరంమండల విద్యాధికారి గురువారావు మాట్లాడుతూ... కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సిఆర్పిల సహకారంతో సీనియార్టీ ప్రాతిపదికగా కాకుండా పనితీరు ఆధారంగా ఎటువంటి వివాదాలు లేకుండా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు నమోదులో మన మండలము జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని, అదేవిధంగా ముందు ఉండాలని దానికి పెద్దలు ఆర్డీవో,ఎంపీడీవో సహకారాలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన నక్క శ్రీనివాస్ ఫౌండేషన్ సేవలు చాలా గొప్పవని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు, టీఎస్ యుటిఎఫ్, తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం,టి టి యు యూనియన్, డి టి ఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జానీ

**మునుగోడు, సెప్టెంబర్ 09( ప్రభాత సూర్య):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేయంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల తాహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం రోజున ధర్నా చేపట్టారు అనంతరం తాసిల్దార్ కు మెమోరండం ఇచ్చారు, ఈ ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జానీ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలు ఇచ్చిన హామీల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని 2 లక్షల 70 వేల కోట్లు కేటాయించాలని 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారి వేతనము 700 రూపాయలు ఇవ్వాలని పట్టణ ప్రాంతంలోని మున్సిపాలిటీలో కూడా ఉపాధి హామీ పనిని విస్తరించాలని పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు,సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ బీసీల బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులను మహిళలపై జరుగుతున్న దాడులను అత్యాచారాలను అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వము ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. 2016నుండి4016, 4016 నుండి 6016వేలకు ఇవ్వాలని కోరారు, వ్యవసాయ కార్మికులు 50 సంవత్సరాలు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్ 6000 రూపాయలు ఇవ్వాలని మహిళలకు గృహలక్ష్మి పథకం అమలు జరిపి నెలకు 2500 ఇవ్వాలని పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలి ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని స్థలాలిచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని వ్యవసాయ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే 25 లక్షలబీమా వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షకార్యదర్శి




ఉప్పునూతలరమేష్, కాయిత వెంకన్న, మాజీ జెడ్పిటిసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జెడ్పిటిసి గోసుకొండ లింగయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజ రామచంద్రం,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగిచలపతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, గోసుకొండ మారయ్య, ఈదుల కంటి కైలాస్, సింగం యాదయ్య, బొజ్జలక్ష్మి, పందుల ముత్యాలి, పందుల ధనమ్మ, మేడి దుర్గమ్మ, ఏర్పుల ధనలక్ష్మి,తదితరులు, పాల్గొన్నారు.

## ప్రజయ్ సిటీ లంబోదరుడి లడ్డూకీ వేలం పాట 2,03,000/- రూపాయలు...




**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**మియాపూర్ ప్రజయ్ సిటీలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి.11 రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న లంబోదరుడి లడ్డూ వేలానికి భక్తులు అనూహ్యంగా పోటీ పడ్డారు. ఈ వేలం పాటలో ప్రజయ్ సిటీ 5వ బ్లాక్ కు చెందిన సునీల్, సాఫ్ట్వేర్ సురేష్ లు రూ.2లక్షల 3 వేల రూపాయలకు వేలం పాట లో వినాయకుడి పెద్ద లడ్డును దక్కించుకున్నారు, జెనరల్ సెక్రటరీ రామకృష్ణ, కమిటీ సభ్యులు సునీల్, సాఫ్ట్వేర్ సురేశ్ లకు గణపతి లడ్డును అందజేశారు. ఆ వినాయకుడికి ఆశీస్సులు సునీల్, సురేష్ కుటుంబ సభ్యులపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణనాథుడి ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ అధ్యక్షులు శివనాగమణి నాయుడు, అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ నాయుడు. జెనరల్ సెక్రటరీ సుబ్బారావు, కాలనీ పెద్దలు రత్నం, సభ్యులు, ప్రజయ్ సిటీ కమ్యూనిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో వినాయక నిమజ్జనానికి బండి రమేష్ కృషి

ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం నిబద్ధత వహించింది
కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ చౌదరి



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 08 (ప్రభాత సూర్య) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా, విజయవంతంగా జరిగాయి. ఈ విజయవంతానికి టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బండి రమేష్ చేసిన కృషి విశేషమని యువ నాయకుడు గాదె శివ చౌదరి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పండుగకు కొత్త శోభ వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నిమజ్జనానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సమగ్ర ఏర్పాట్లు జరగగా, భద్రతా బందోబస్తును పటిష్టంగా అమలు చేసినట్టు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం నిబద్ధతతో పనిచేయడం గమనార్హమని శివ చౌదరి అన్నారు. ఇక బోనాల పండుగతో పాటు వినాయక నిమజ్జన ఏర్పాట్లను కూడా బండి రమేష్ వ్యక్తిగతంగా పర్యవేక్షించారని ఆయన వివరించారు. ప్రజలతో మమేకమై పండుగ వాతావరణం ఐక్యతతో, ఆనందభరితంగా కొనసాగేలాగా కృషి చేశారని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి వినాయక మండపాల వద్ద ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పే దిశగా చర్యలు తీసుకుంటామని, గణేశుని తొమ్మిది రోజులపాటు నిష్ఠతో పూజించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నామని శివ చౌదరి తెలిపారు. ఈ విధంగా ఆధ్యాత్మికతతో కూడిన పూజల ద్వారా ఉత్సవాల వైభవం మరింత పెరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ సరఫరా, పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు, బండి రమేష్ పర్యవేక్షణతో కూకట్‌పల్లిలో వినాయక నిమజ్జనం ఘనంగా, విజయవంతంగా పూర్తయిందని శివ చౌదరి స్పష్టం చేశారు.

## మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగంలో 13వ ర్యాంకు సాధించిన

కల్లెట్ల అరుణ్ సాగర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 08( ప్రభాత సూర్య ):** తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్షల్లో ( సిపిజిఈటి ) ఎమ్మెస్ డబ్ల్యూ - మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగంలో రాష్ట్రస్థాయిలో /తెలంగాణ స్థాయిలో కల్లెట్ల అరుణ్ సాగర్ కి 13 వ ర్యాంకు లభించింది .. గత కొన్ని సంవత్సరాలుగా సహస్ర వేదిక్ సేవా సమితి తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న వారు ప్రస్తుతము యూత్ ఫర్ సేవ వాలంటీర్ సంస్థ హైదరాబాద్ కళాశాలల విద్యార్థి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు . వీరికి వచ్చిన ర్యాంకు ప్రకారం ఇప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ(ఓయూపీజీసీ) లో అడ్మిషన్ వచ్చే అవకాశం ఉంది

## ప్రభుత్వ బడులకు రేటింగ్

ఆరు అంశాల ఆధారంగా నిర్ణయం
రేటింగ్ సాధించిన స్కూళ్లకు పురస్కారాలు

**కరీంనగర్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) పేరుతో మెరుగైన సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాయి. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థుల ఆరోగ్యాలు బాగుంటాయని, వారి ఆరోగ్యాలు బాగుంటే నాణ్యమైన చదువు అందుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి 2020 వరకు పాఠశాలలకు ఏటా ప్రత్యేక పురస్కారాలు అందించింది. ఐదేళ్లుగా నిలిచిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ విద్యా సంవత్సరం ప్రారంభించింది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) పేరుతో ప్రత్యేక పురస్కారాలు అందించనుంది. మూత్రశాలలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, నీటివసతి తదితర అంశాలను పక్కాగా అమలు చేస్తున్న పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనున్నారు. 60అంశాల ఆధారంగా 1%-%5 రేటింగ్ కేటాయించనున్నారు. అత్యుత్తమ రేటింగ్ సాధించి, జాతీయస్థాయికి ఎంపికై న పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష నజరానా అందించనుంది. జిల్లావ్యాప్తంగా 651 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 35వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. మనఊరు%-% మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల అమలుతో చాలా పాఠశాలల రూపురేఖలు మారాయి. కిచెన్ గార్డెన్ల వినియోగం, మరుగు దొడ్ల నిర్వహణ మెరుగుపడ్డాయి. ఇలాంటి పాఠశాలల్లో ఆరు ప్రధానాంశాలను నమోదు చేసి, దాన్నిబట్టి రేటింగ్ ఇస్తారు. మొత్తం 60 ప్రశ్నలకు 125 మార్కులు సాధిస్తే అయిదు స్టార్స్ ఇస్తారు. నీటి సంరక్షణ, తాగునీటి వసతికి 22 మార్కులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, చేతుల శుభ్రతకు 27, మొక్కలు తోటల పెంపకానికి 14, వ్యర్థాల నిర్వహణకు 21, విద్యుత్తు పొదుపు, సోలార్ వినియోగానికి 20, పర్యావరణ పరిరక్షణ అవగాహనకు 21 మార్కులు ఉంటాయి. అయిదు రేటింగ్స్ సాధించిన పాఠశాలలకు కేంద్రం పురస్కారాలు అందించే అవకాశం ఉంది. పాఠశాలలను అభివృద్ధి చేసి, నిర్వహణలో తమవంతు కృషి చేస్తున్న హెచ్ఎంలు చొరవ తీసుకొని నమోదు చేయాల్సిన అవసరం ఉంది.

# వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా గట్టుప్పల్ తాహసిల్దార్ కార్యాలయముందు నిర్వహణ

**గట్టుప్పల్ ప్రభాతసూర్య 8** నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తాహసిల్దార్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీ బొలుగురు నరసింహ ప్రధానంగా మాట్లాడారు. శ్రీ నరసింహ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా, కేంద్ర ప్రభుత్వానికి ఉపాధి హామీ పథకానికి ?2,70,000 కోట్లు కేటాయించి, ప్రతి రైతు కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారీ కనీస వేతనం ?700 ఇవ్వాలని తీవ్ర డిమాండ్ చేశారు. ఇది పట్టణ ప్రాంతంలోని మున్సిపాలిటీలకూ వర్తించాలి అని అభ్యర్థించారు. పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని, సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని ప్రతిష్టగా అమలు చేయాలని స్పష్టంగా తెలిపారు. అతి దుర్మార్గంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ఎండమూడా ఆపాలని, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు నెలకు ?12,000 ఆత్మీయ భరోసా నిధులు అందించాలని, 2016 నుండి ?4016 నుండి ?6016కి పెంచాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పూర్తిచేసిన వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ?6,000 చేయాలని, మహిళలకు గృహలక్ష్మి పథకం అమలు చేసి నెలకు ?2,500 ఇచ్చించాలని తక్షణ చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. అంతేకాక, పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు జారీ చేసి, గుడిసెలు వేసుకున్న వారికి హక్కుగా ఇంటి స్థలాలు ఇచ్చి, వాటి నిర్మాణాన్ని ప్రారంభించాలని, వ్యవసాయ కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినపక్షంలో ?25 లక్షల బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ మండల కార్యదర్శి




బీవనపల్లి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వల్ల పెంటయ్య, ఉపాధ్యక్షులు గూడెపు నరసింహ, మండల నాయకులు కందాల ముత్యాం, దేండేనరసింహ, రాపోలు సత్తయ్య, మాధగోని యాదయ్య, కట్ట ధర్మయ్య, అనిమల్ల శేఖర్, కట్ట చెన్నయ్య, కట్ట శేఖర్, కొల్లూరు లింగయ్య, బాలం లింగయ్య, బరిగల యాదయ్య తదితరులు సజాగ్రతగా పాల్గొన్నారు.


# శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం కలెక్టర్కు వినతి

మర్రిగూడ మాజీ ఎంపీపీ
బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్

**మర్రిగూడ ప్రభాతసూర్య 8** మర్రిగూడ మండల ప్రజల ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడం కోసం మార్గదర్శక చర్యగా మర్రిగూడ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ నల్లగొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి ఇలా త్రిపాఠి కలిసివి వినతి పత్రం అందజేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం మార్గనిర్దేశకంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయడం జరిగింది. అనంతరం ప్రజల అవసరాలు పెరుగుతున్నందున ఈ 30 పడకల ఆసుపత్రిని 50 పడకలుగా పెంచుతూ జీవో జారీ చేయబడింది. అయితే, రెండు వైద్య కేంద్రాలు ఒకేచోట ఉండటం చట్ట విరుద్ధమని భావించిన అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు సమగ్ర విచారణ తరువాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామానికి తరలించాలని నిర్ణయించారు. పరిసర గ్రామాలైన ఖుదాబక్ష్ పల్లి, వెంకే పల్లి, చర్లగూడెం, రాంరెడ్డి పల్లి, నర్సిరెడ్డి గూడెం, అంతంపేట, ఇందుర్తి, కొట్టాల, నామపురం, సరంపేట, లెంకలపల్లి గ్రామాలలో సుమారు 30 వేల మంది పేద ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందేలా ఈ నిర్ణయం



తీసుకున్నారు. అప్పటి అధికారులు సంబంధిత ఉత్తర్వులు జారీచేశారు, అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటివరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టలేకపోయారు. ఈ నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య హితాన్ని ప్రథమంగా పరిగణిస్తూ, అనంత రాజు గౌడ్ గారు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేస్తూ త్వరగా శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



Anantha Raju Goud
Mandal Praja Parishath President
(Marriguda)
Dist. Nalgonda. Telangana State

H.No. 11-13-714, Road No. 4,
Green Hills Colony, Near Ozone Hospital,
Saroornagar,Hyderabad -35.
Telangana State.
Cell : 9000096363
E-mail : anantharaju6363@gmail.com

Ref. :  Date : 8/9/2025

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్
శ్రీమతి ఇలా త్రిపాఠి, నల్లగొండ గారికి
నమస్కరించి వ్రాయునది ఏమనగా!
ఆర్యా!

విషయం:నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలంలో ఉన్నటువంటి (PHC) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మండల పరిధిలోని శివన్న గూడ గ్రామములో ఏర్పాటు చేయుట గురించి.

---

పై విషయానుసారం తమరికి తెలియజేయునది ఏమనగా.మర్రిగూడ మండల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, గత రాష్ట్ర ప్రభుత్వం మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించడం జరిగింది. మండల కేంద్రంలో రెండు వైద్య కేంద్రాలు ఒకే ఆవరణలో ఉండడం చట్ట విరుద్ధం అని భావించిన అప్పటి మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామానికి తరలించినట్లయితే శివన్నగూడ పరిసర గ్రామాలైన ఖుదాబక్ష్ పల్లి, వెంకేపల్లి, చర్లగూడెం, రాంరెడ్డిపల్లి, నర్సిరెడ్డిగూడెం, అంతంపేట, ఇందుర్తి, కొట్టాల, నామాపురం, సరంపేట, లెంకలపల్లి గ్రామాలలో సుమారుగా 30 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు ఓసి పేద ప్రజలకు వైద్య సదుపాయం అందుతుందనే ఉద్దేశంతో శివన్న గూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి తీర్మానం చేశారు. ఉత్తర్వులు కూడ జారీ చేశారు. కానీ అంతలోనే ప్రభుత్వం మారడంతో ఇప్పటివరకు ఏలాంటి ఏర్పాట్లు చేయలేకపోయారు. దీనివల్ల అట్టి గ్రామాలలో నివసించే పేద ప్రజలు మండల కేంద్రానికి రాలేక ప్రైవేట్ ఆసుపత్రులలో డబ్బులు వైద్యానికి ఖర్చు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. కావున దయచేసి అట్టి గ్రామాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు చేసి తగిన వసతులు కల్పించాలని మనవి చేసుకుంటున్నాను.

కృతజ్ఞతలతో,

DCHS
Pls re-verify & put up as per feasibility

ఇట్లు,
అనంత రాజు గౌడ్
మర్రిగూడ మాజీ ఎంపీపీ,
మునుగోడు నియోజకవర్గం

Marriguda37@gmail.com

# హనుమాన్ యూత్ లడ్డూను రూ.6లక్షల 30 వేలకు దక్కించుకున్న కుమ్మరి కైతాపూరం శ్రీశైలం

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫిజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హాఫిజ్ పేట్ గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను 11రోజుల పాటు భక్తిశ్రద్దలతో నిర్వహించారు.అనంతరం వినాయక నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.శనివారం రాత్రి నిర్వహించన లడ్డూ వేలం పాటలో హనుమాన్ యూత్ లడ్డూను కుమ్మరి కైతాపూరం శ్రీశైలం రూ.6 లక్షల 30 వేల రూపాయలకు దక్కించుకుని రికార్డ్ బ్రేక్ సృష్టించారు.ఈ సందర్భంగా హనుమాన్ యూత్ సభ్యులు కుమ్మరి కైతాపూరం శ్రీశైలంని అభినందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వినాయకులను ఊరేగింపు నిర్వహించి కోనేరులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్ గౌడ, తలారి వినోద్ ముదిరాజ్, సూర్యం, దేవేందర్, రాజు, సంతోష్, సుధాకర్, శివ, ఫిష్ వెంకట్, కుమ్మరి రాజు, శేఖర్, ప్రవీణ్, రంజిత్, ఆదిత్య మెడికల్స్ చింటూ, కుమ్మరి వీరేష్, మునిగొండ రవి, విక్రమ్, శేఖర్, రాజు సురేష్, బాలు, రాము, నరేష్ కాంబ్లీ, నాగరాజ్, భరత్, మహేష్, నారాయణ,



హనుమాన్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, పిల్లలు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు జీఎస్టీ తగ్గింపు

భారతదేశం అభివృద్ధిలో నడుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ
స్థానిక ఎన్నికల జిల్లా ఇన్చార్జి .రాచాల పురుషోత్తం రెడ్డి

**పెబ్బేరు సెప్టెంబర్ 8 (ప్రభాత సూర్య)** భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా మధ్యతరగతి మరియు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకై జి ఎస్ టి ని పెద్ద మొత్తంలో తగ్గిస్తూ మన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మరియు మన ప్రియతమ ప్రధాని దేశ అభివృద్ధిలో అలుపెరుగని యోధుడు ప్రపంచం మెచ్చిన ధీరుడు నరేంద్ర మోడీ చిత్రపటాలకు సోమవారం పెబ్బేరు పట్టణ శాఖ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కావలి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పన్నీరుతో అభిషేకం చేశారు భారతీయ జనతా పార్టీ జిల్లా స్థానిక ఎన్నికల ఇన్చార్జి రాచాల పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ. దేశ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఎన్నో ఉన్నత నిర్ణయాలను తీసుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ తనపై ఒక్క ట్రంటూ ఒక్కటి కూడా మచ్చ లేకుండా పరిపాలన కొనసాగిస్తున్న ప్రధానమంత్రి కి మండల పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గొని హేమా రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, ఒబిసి మోర్చా ఉపాధ్యక్షులు చింతల రామకృష్ణ , జిల్లా విద్యాశాఖ కన్వీనర్



నరసింహనాయుడు , పట్టణ ప్రధాన కార్యదర్శి మోతె రాఘవేంద్ర, అన్నే శ్రీకాంత్, రాకేష్ గౌడ్, గోనెలా అరవింద్, శ్రీకాంత్ చారి, రవితేజ, రాజేష్ తదితరులు పాల్గొనడం జరిగినది.

## నల్లగండ్ల మెయిన్ రోడ్డు మరమ్మతులు చేపట్టిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్...



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల నల్లగండ్ల మెయిన్ రోడ్డు పూర్తిగా గుంతల మయమైపోవడంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే సీసీ ప్యాచ్ వర్క్ పనులను చేపట్టమని ఆదేశించారు. జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు వెంటనే స్పందించి ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పనులను పరిశీలిస్తూ ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, ప్రజాప్రతినిధులు ఇటీవల తన దృష్టికి తీసుకొని రావడంతో వెంటనే అధికారులకు ఆదేశించి నల్లగండ్ల మెయిన్ రోడ్డు సీసీ ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించి పరిశీలించానని పేర్కొన్నారు.

## విచారణ చేపట్టిన విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు.....

మాదాపూర్ అయ్యప్ప సొసైటీ లో రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ విజిలెన్స్అధికారులు...



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ అయ్యప్ప సొసైటీ లో రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ విజిలెన్స్అధికారులు... అయ్యప్ప సొసైటీలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు.ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. విద్యుత్ విజిలెన్స్ సీఐ రామకృష్ణ ఇతర అధికారులు అయ్యప్ప సొసైటీలో విచారణ చేపట్టారు. సరైన పత్రాలు లేకుండానే విచ్చలవిడిగా కరెంట్ మీటర్లు ఇచ్చారని, నిర్మాణాలు అయిన బిల్డింగ్ లకు కూడా ఓసీ ఇవ్వకుండానే అక్రమంగా కనెక్షన్లు ఇచ్చారని అధికారుల దృష్టికి వచ్చింది. విద్యుత్ కనెక్షన్ల విషయంలో అధికారులు భారీగా ముడుపులు తీసుకున్నారని, సుప్రీంకోర్టు ఆర్డర్ సైతం బేఖాతరు చేసినట్లు తెలుస్తోంది. విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు లక్షల్లో వసూళు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలకు కరెంట్ మీటర్ల మంజూరు విషయంలో లైన్ మెన్ల నుండి ఏఈ, డీఈ, ఎస్ ఈ స్థాయి అధికారుల వరకు పాత్రధారులుగా ఉన్నట్లు సమాచారం. ఒక్కో స్తంభానికి ఇంత అంటూ రేట్ కట్టి, మీటర్ల మంజూరు కోసం భారీ వసూళ్లు పాల్పడ్డారని, సుప్రీంకోర్టులో కేసులో ఉన్న భూముల్లో కట్టిన నిర్మాణాలకు ఎలా మీటర్లు మంజూరు చేశారు. అంటే.. నిర్మాణదారులు అఫిడవిట్ ఇచ్చారంటూ విద్యుత్ సిబ్బంది తప్పించుకునేందుకు చూస్తుండడం గమనార్హం. అయ్యప్ప సొసైటీలో కొనసాగుతున్న విద్యుత్ విజిలెన్స్ విచారణలో విద్యుత్ అధికారుల డొంక కదులుతోంది. బడా బిల్డర్ల దగ్గర భారీగా డబ్బుల వసూళ్లకు పాల్పడినబిల్డర్ల దగ్గర భారీగా డబ్బుల వసూళ్లకు పాల్పడిన విద్యుత్ సిబ్బంది అరాచకాలు విజిలెన్స్ విచారణలో ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. అలాగే అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణలపై త్వరలో జీహెచ్ఎంసీ విజిలెన్స్ విచారణకు అవకాశం ఉన్నట్లు సమాచారం.

## జనచైతన్య కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అంబోజి అనిత జగదీశ్ యాదవ్



**తుర్కయంజాల్, సెప్టెంబర్ 08, ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 21వ వార్డు పరిధిలోని జనచైతన్య కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక నిర్వహించారు.నూతన గౌరవ అధ్యక్షుడుగా జొన్నాడ జలేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా అంబోజి అనిత జగదీశ్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా ఎర్రవోతు వెంకటేశ్వర్ రెడ్డి, ఇంద్రావత్ బుజ్జి లక్ష్మణ్ నాయక్, జనరల్ సెక్రటరీ గంగిరెడ్డి వీణ మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ గుండా సునీత శ్రీశైలం, దేంది స్వాతి సిద్ధప్ప రెడ్డి, నారెండ్ల సుష్మ రాజశేఖర్ రెడ్డి,జాయింట్ సెక్రటరీగా సంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,కోశాధికారిగా దొంతం లావణ్య చంద్రశేఖర్ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ పల్లా లోహిత్ రెడ్డి,కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా నూతన కమిటీ పనిచేస్తుందన్నారు.కార్యవర్గ సభ్యులుగా మేకల రాములు, బొక్క అనంతలక్ష్మి, పోలగొని వెంకటయ్య గౌడ్,దాడిగ సుశీల, రావుత్ వెంకటయ్య గౌడ్, జలగం మాలతి, బోర్రు శోభా, కళావతి, రేణుక, రంగా నర్సింహులు, వంకేశ్వర స్వప్న, లీల,ఆకుల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

పూర్వ టెన్త్ క్లాస్ విద్యార్థులు ఉపాధ్యాయ టీచర్లకు ఘన సన్మానం




**మునుగోడు, సెప్టెంబర్ 08( ప్రభాత సూర్య):** మండలంలోని ఎంపీపీఎస్ ప్రైమరీ స్కూల్ టీచర్లు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు తీసుకున్న వి.అపర్ణకి సోమవారం రోజున ఉపాధ్యాయులకు టీచర్లకు 2006-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మనిషి జీవితంలో ఉపాధ్యాయ సేవలు మరువలేనివి అని తెలిపారు, ఈ కార్యక్రమంలో. కంచర్ల సందీప్, దుబ్బ పురుషోత్తం, రెడ్డిమల్ల వెంకటేష్, పందుల పందుల రవిశంకర్, ఉపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# నోటి చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుందా?



చిగుళ్ళలో రక్తస్రావం అనేది దంత ఆరోగ్యానికి మాత్రమే సంబంధించినదని అందరూ అనుకుంటారు. కానీ దీని వెనుక వివిధ కారణాలు ఉన్నాయని మీకు తెలుసా? గుండె జబ్బు ఉన్నవారిలో చిగుళ్ళలో రక్తస్రావం జరుగుతుందని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. హార్వర్డ్ హెల్త్ నిర్వహించిన ఈ అధ్యయనం మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. నోటి ఆరోగ్యం మంచిది కాకపోయినా, పేలవంగా ఉన్నా గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుందని పేర్కొంది. ఎందుకంటే చిగుళ్ళకు, గుండెకు మధ్య ఎలాంటి సంబంధం ఉంటుందో అని అందరూ అనుకుంటారు. కానీ పరిశోధకులు దీని గురించి మరింత సమాచారం అందించారు. నోటి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో కొన్ని విషయాలు కూడా పంచుకున్నారు. కొంతమందికి పళ్ళు తోముకునేటప్పుడు, తినేటప్పుడు చిగుళ్ళ నుంచి రక్తస్రావం జరుగుతుంది. ఇది క్రమం తప్పకుండా జరిగితే మందులు తీసుకుంటారు. అది నయమైతే అంతటితో వదిలేస్తారు. కానీ హార్వర్డ్ హెల్త్ వెల్లడించిన సమాచారం ప్రకారం..చిగుళ్ళలో వాపు, రక్తస్రావం వంటి సమస్యలను ఎదుర్కొనే వ్యక్తికి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది. చిగుళ్ల వ్యాధికి, గుండె జబ్బులకు ప్రత్యక్ష సంబంధం ఉందా లేదా అనేది స్పష్టంగా తెలియదు. కానీ పరిశోధకులు దీనికి ఒక కారణం ఉందని చెబుతున్నారు. చిగుళ్లలో రక్తస్రావం కలిగించే బ్యాక్టీరియా దీనికి కారణం. అదే బ్యాక్టీరియా నోటి ద్వారా రక్తప్రవాహంలోకి ప్రవేశించి రక్త నాళాలలో వాపును పెంచుతుంది. ఫలితంగా ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇవన్నీ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. ఇది బ్యాక్టీరియా వల్ల మాత్రమే కాదు. చిగుళ్లలో రక్తస్రావం అయినప్పుడు, రోగనిరోధక వ్యవస్థ కూడా క్షీణిస్తుంది. ఈ ప్రతిచర్య రక్త నాళాలను దెబ్బతీస్తుందని పరిశోధకులు తెలిపారు. గుండెకు, దంతాలకు హాని కలిగించే అలవాట్ల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ధూమపానం ప్రధాన కారకం. కొన్ని సందర్భాల్లో వంశపారంపర్యంగా కూడా ఇలా జరుగుతుంది. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం, ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల నోటి ఆరోగ్యమే కాకుండా గుండె ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుంది. కానీ చిగుళ్ళ నుంచి రక్తస్రావం కావడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వీటిని అశ్రద్ధ చేయకూడదు. నోరు బ్రష్ చేసుకున్నప్పుడు చిగుళ్ళ నుండి రక్తం కారుతుంది. దుర్వాసన కూడా వస్తుంది. ఆహారాన్ని నమలడం ఇబ్బందిగా ఉంటుంది. దంతాలు సాధారణం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. కొన్నిసార్లు అవి ఊడిపోయే అవకాశం కూడా ఉంది. కొన్ని అలవాట్లు కూడా ఈ సమస్యకు కారణమవుతాయి. అధికంగా ధూమపానం, గుట్కా నమలడం వల్ల ఈ సమస్య వస్తుంది. వీటివల్ల నోటిలో బాక్టీరియా ఏర్పడుతుంది. దీంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. ఫలితంగా గుండె జబ్బులు వస్తాయి. అధిక రక్తపోటు ఉన్నవారికి చిగుళ్ళ నుంచి రక్తస్రావం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఊబకాయం కూడా దీనికి కారణం కావచ్చు. శరీరంలో ఎక్కువ కొవ్వు పేరుకుపోయినప్పుడు ఈ రకమైన సమస్య వస్తుంది. ఇది మాత్రమే కాదు, ఎక్కువ చక్కెర తీసుకోవడం వల్ల కూడా ఈ సమస్యలు వస్తుంది. కానీ మీరు నోటి ఆరోగ్యాన్ని కాపాడుకుంటే అలాంటి సమస్యలను నివారించవచ్చు. రోజుకు కనీసం రెండుసార్లు పళ్ళు తోముకోవడం చాలా అవసరం. మృదువైన బ్రష్‌లు మాత్రమే ఉపయోగించాలి. మూడు నెలల కంటే ఎక్కువ కాలం బ్రష్‌ను ఉపయోగించకూడదు.

# ఆ సమస్యలు ఉన్నాయా.? కాలీఫ్లవర్ తింటే.. అంతే సంగతులు



కాలీఫ్లవర్‌లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కానీ ప్రతిరోజూ కాలీఫ్లవర్ తినడం కొంతమందికి కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అందుకే ఈ సమస్యతో బాధపడేవారు కాలీఫ్లవర్ తినకుండా దూరంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీరు గ్యాస్, ఎసిడిటీ సమస్యలతో బాధపడుతుంటే క్యాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. క్యాలీఫ్లవర్‌లో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి జీర్ణ సమస్యలను పెంచుతాయి. అలాగే మీరు థైరాయిడ్ సమస్యలతో బాధపడుతుంటే కాలీఫ్లవర్ తినకండి. ఇది మీ సమస్యలను మరింత పెంచవచ్చు. కాలీఫ్లవర్ తినడం వల్ల థైరాయిడ్ గ్రంథి అయోడిన్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల సమస్యలు తలెత్తుతాయి. కాలీఫ్లవర్ ముఖ్యంగా ౦3, ౦4 హార్మోన్ల స్థాయిలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ రోగులు కాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. మీకు గాల్ బ్లాడర్, కిడ్నీలో రాళ్లు ఉన్నట్లయితే కాలీఫ్లవర్ తినకపోవడమే మంచిది. కాలీఫ్లవర్‌లో క్యాల్షియం ఉంటుంది. ఇది రాళ్ల సమస్యను పెంచుతుంది. అలాగే మీకు రక్తం గడ్డకట్టే సమస్యలు ఉంటే కాలీఫ్లవర్ తినవద్దు. కాలీఫ్లవర్‌లో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలోని రక్తాన్ని చిక్కగా చేస్తుంది. కాబట్టి ఇలాంటి వారు కాలీఫ్లవర్ అస్సలు తినకూడదు. గర్భధారణ సమయంలో కాలీఫ్లవర్ తినకూడదు. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా గర్భధారణ సమయంలో గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి క్యాలీఫ్లవర్‌ను నివారించడం చాలా ముఖ్యం.

# సామలు... ఆరోగ్యానికి అమృతమే..!



సామలు అనేవి చిరుధాన్యాల కోవకు చెందిన ఒక రకమైన గింజలు. వీటిని ఆంగ్లంలో లిటిల్ మిల్లెట్ అంటారు. భారతదేశంలో వీటిని అనేక ప్రాంతాల్లో పండిస్తారు, ఆహారంగా ఉపయోగిస్తారు.సామలు అద్భుతమైన సిరి ధాన్యాలు. వీటి ఉపయోగంతో శరీరానికి ఎన్నో లాభాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో పీచు పదార్థం, ఖనిజాలు విటమిన్లు, పుష్కలంగా ఉంటాయి. సామలు సహజంగా గ్లూటెన్ రహితమైన ఆహారం. గ్లూటెన్ పడని వారికి ఇది ఉత్తమమైన ఎంపిక. గోధుమలు, బార్లీ వంటి వాటికి బదులుగా సామల వాడకంతో జీర్ణ సంబంధిత సమస్యలు రావు. గ్లూటెన్ లేని ఆహారం తీసుకోవాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపిక. సామలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పేగు కదలికలను సాఫీగా చేస్తుంది. సామలలో మెగ్నీషియం ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. విటమిన్ దీ3 (నియాసిన్) కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. సామలు తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. కాబట్టి, మధుమేహం ఉన్నవారు వీటిని తీసుకోవడం చాలా మంచిది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. సామలలో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, బి విటమిన్లు వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలు బలంగా ఉండటానికి శరీరంలోని ఇతర ముఖ్యమైన విధులకు తోడ్పడతాయి. సామలలో ఫాస్పరస్ ఉంటుంది, ఇది కొవ్వుల జీవక్రియ, శరీర కణజాలాల మరమ్మత్తు, శక్తి ఉత్పత్తికి సహాయపడుతుంది. మానవ శోషరస వ్యవస్థను శుద్ధి చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, సామలు మెదడు, గొంతు, రక్తం, థైరాయిడ్, క్లోమ గ్రంథి క్యాన్సర్లతో పోరాడటానికి సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తాయి.

# రాత్రి భోజనం తర్వాత రోజూ 2 యాలకులు తినండి



రోజంతా పనిచేసి అలసిన శరీరం రాత్రి నిద్రపోవడానికి ఆసక్తి చూపిస్తుంది. అయితే కొంతమంది రాత్రి భోజనం చేసిన తర్వాత గ్యాస్, అసిడిటీ లేదా ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటి వారు మెడిసిన్స్ కు బదులుగా వంట గదిలో ఉండే వస్తువులనే తీసుకోవడం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది. ఆ మసాలా దినుసు యాలకులు. చాలా మంది యాలకులను టీ, బిర్యానీ లేదా ఖీర్ వంటి వాటి వాటికీ రుచిని పెంచే మసాలా దినుసుగా భావిస్తారు. అయితే వాస్తవానికి ఈ చిన్న సువాసనగల యాలకులు ఆరోగ్యానికి ఒక వరం. రాత్రి భోజనం తర్వాత కేవలం రెండు ఆకుపచ్చ యాలకులను నమలడం వల్ల అనేక సమస్యలు నయమవుతాయి.జీర్ణక్రియ మెరుగుపడుతుంది: నేటి బిజీ జీవితంలో తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా జీర్ణ సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. రాత్రి భోజనం తర్వాత రెండు ఆకుపచ్చ యాలకులు నమలడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. యాలకులు ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌లను ప్రేరేపించే అంశాలను కలిగి ఉన్నాయి. ఈ కారణంగా ఆహారం త్వరగా , పూర్తిగా జీర్ణమవుతుంది. ఇది గ్యాస్, ఆమ్లత్వం, ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. నోటి దుర్వాసనను వదిలించుకోండి: దుర్వాసన అనేది ఒక సాధారణ , ఇబ్బందికరమైన సమస్య. రాత్రి ఆహారం తిన్న తర్వాత యాలకులు నమలడం వల్ల ఈ సమస్య పరిష్కారం అవుతుంది. యాలకుల తేలికపాటి సువాసన దుర్వాసనను తక్షణమే తొలగిస్తుంది.శ్వాసను తాజాగా చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటి దుర్వాసనకు ప్రధాన కారణమైన నోటిలో పెరిగే బ్యాక్టీరియాను కూడా చంపుతాయి. నిద్ర లేమి సమస్య నుంచి ఉపశమనం: ఈ రోజుల్లో ఒత్తిడి ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారింది. నిద్రను కూడా ప్రభావితం చేస్తుంది. రాత్రి భోజనం తర్వాత యాలకులు నమలడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. యాలకులు శరీరంలో 'సెరోటోనిన్' అనే హార్మోన్‌ను పెంచే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటాయి. సెరోటోనిన్ అనేది సహజమైన మూడ్ బూస్టర్. ఇది ఒత్తిడిని తగ్గించడంలో , మంచి ,గాఢ నిద్రను పొందడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రణ: అధిక రక్తపోటు అనేది అనేక ఇతర వ్యాధులకు కారణమయ్యే తీవ్రమైన వ్యాధి. యాలకులలో పొటాషియం,మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. రాత్రి భోజనం తర్వాత యాలకులు తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. బరువు తగ్గడంలో సహాయం: బరువు తగ్గాలనుకున్నవారు రాత్రి భోజనం తర్వాత యాలకులు తీసుకోవడం యోజనకరంగా ఉంటుంది. యాలకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ జీవక్రియను పెంచుతాయి, ఇది కొవ్వును కాల్చే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఇది శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. ఇది బరువు తగ్గడానికి చాలా ముఖ్యమైనది.

## బిజినెస్


# పండగ షాపింగ్‌కు రెడీ అవుతున్నారా?

### వెళ్లిపోతున్న విదేశీ నిధులు



భారతీయ స్టాక్ మార్కెట్లలో గత కొంతకాలంగా ప్రతికూల సెంటిమెంట్ కొనసాగుతోంది. ఫలితంగా మన మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులను వెనక్కి తీసుకెళ్తున్నారు. డిపాజిటరీ డేటా ప్రకారం, సెప్టెంబర్ మొదటి వారంలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ. 12,257 కోట్ల విలువైన నిధులను ఉపసంహరించుకున్నారు. ఇందుకు ప్రధానంగా భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాలు, డాలర్ మారకం బలంగా ఉండటం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు కారణాలుగా ఉన్నాయి. గత నెలలో ఎఫ్‌పీఐలు రూ. 34,990 కోట్లను, అంతకుముందు జూలైలో రూ. 17,700 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2025లో ఇప్పటివరకు మొత్తం రూ. 1.43 లక్షల కోట్ల విదేశీ నిధులు మన ఈక్విటీల నుంచి వెళ్లాయని డిపాజిటరీ డేటా పేర్కొంది. రానున్న వారంలోనూ అమెరికా ఫెడ్ రేట్ల కోతపై వస్తున్న ఊహాగానలు, అమెరికా లేబర్ డేటా, ఆర్‌బీఐ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు, భారత రూపాయి మారకం వంటి అంశాలు ఎఫ్‌పీఐల నిధుల ఉపసంహరణపై ప్రభావితం చూపుతాయని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త జీఎస్టీ సంస్కరణల కారణంగా వ్యవస్థలో గిరాకీ పుంజుకుంటుందని, ప్రభుత్వం ఆదాయం మెరుగుపడుతుందనే అంచనాలున్నాయి. దీనికితోడు విధానపరమైన సంస్కరణలు ఎఫ్‌పీఐలను తిరిగి ఈక్విటీల్లో పెట్టుబడులను ఆకర్షించవచ్చని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ వెల్లడించారు.

### కార్లపై రూ. 2.40 లక్షల వరకు తగ్గింపు ప్రకటించిన హ్యుండాయ్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాలను వాహన తయారీ కంపెనీలు కస్టమర్లకు బదిలీ చేయడం ప్రారంభించాయి. ఇప్పటికే టాటా మోటార్స్, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, రెనో ఇండియా కంపెనీలు తగ్గింపు వివరాలను వెల్లడించగా, ఇదే బాటలో హ్యుండాయ్ కూడా నిలిచింది. ఆదివారం నాటి అధికారిక ప్రకటనలో హ్యుండాయ్ మోటార్ ఇండియా తన పోర్ట్‌ఫోలియోలోని కార్ల ధరలను గరిష్ఠంగా రూ. 2.40 లక్షల వరకు తగ్గించినట్టు వెల్లడించింది. ఈ తగ్గింపు వెర్నాపై రూ. 60,640 నుంచి ప్రీమియం ఎస్‌యూవీ టక్సన్‌పై రూ. 2.40 లక్షల వరకు ఉంటుందని తెలిపింది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి వర్తిస్తాయని పేర్కొంది. జీఎస్టీ సంస్కరణలు వాహన పరిశ్రమకు ఊతమివ్వడమే కాకుండా లక్షలాది మంది కస్టమర్లకు సరసమైన ధరలో వాహనాలు లభిస్తాయని హ్యుండాయ్ మోటార్ ఇండియా ఎండీ ఉన్సూ కిమ్ చెప్పారు. ఇదే సమయంలో దేశీయ వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ కమరషియల్ వాహనాల ధరలను కూడా సవరించినట్టు ప్రకటించింది. జీఎస్టీ తగ్గింపు పూర్తి ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తామని కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ తన కమర్షియల్ వాహనాల ధరలను రూ. 30,000 నుంచి రూ. 4.65 లక్షల వరకు తగ్గించినట్టు పేర్కొంది.



మన దేశంలో పండగల సీజన్ మొదలైపోయింది. మరో 15 రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత దీపావళి మొదలు కొని సంక్రాంతి వరకు ఏదో ఒక పండగ వస్తూనే ఉంటుంది. ముఖ్యంగా దసరా, దీపావళి పెద్ద పండగలు. యావత్ భారతావని ఈ రెండు పండగలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. పండగ అంటే కొత్త బట్టలు ఉండాల్సిందే. ఇక పూజా సామగ్రి, గృహోపకరణాలు, బంగారం, వెండి ఆభరణాలు కొంటుంటారు. మరి ఈ లాంగ్ పండగ సీజన్‌లో షాపింగ్ చేసేందుకు మీరు సిద్ధమవుతున్నారా? పండగలు, ప్రత్యేక సందర్భాలు ఎప్పుడు వస్తున్నాయి, ఎప్పుడు ఏది కొనాలి, ఎక్కడ ఎలా కొనాలి, ఎంత బడ్జెట్లో కొనుగోలు చేయాలి? అనే వివరాలతో ఒక లిస్ట్ రాసి పెట్టుకోవాలి. దుస్తుల బడ్జెట్‌తో పాటు పండగకు అయ్యే ఖర్చును ఆ లిస్టులో చేర్చాలి. అందులోనే మీ రాబడి ఎంత, ఖర్చు ఎంత అవుతుందని రాసుకోవాలి. రెండింటి లెక్క చూసుకుని ఖర్చు చేయాలి. కొనుగోలు చేయాలనుకుంటున్న వాటిలో అతి ముఖ్యమైనవి ఏవి, ముఖ్యమైనవి ఏవి, అంతగా ప్రాధాన్యం లేనివి అవి లేకున్నా పని జరుగుతుందనే వాటిని విభజించుకుని ఓ లిస్ట్ తయారు చేసుకోవాలి. దీంతో వృథా ఖర్చు తగ్గించుకోవచ్చు. కొనుగోలు చేసే ముందు ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ఉన్న ధరలను చెక్ చేయాలి. ఆ తర్వాత దుకాణాల్లో ధరలను పోల్చి చూసుకోవాలి. ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ తీసుకుంటే సరిపోతుంది. అయితే, నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. ఇంట్లో తరుచుగా ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేయాలనుకుంటే మాత్రం ఒక్కోటి కాకుండా బల్క్‌లో తీసుకోవడం మంచిది. ఒకేసారి ఎక్కువ కొంటే ఆఫర్లు ఉంటాయి. తక్కువ ధరకే లభిస్తాయి. పండగల సమయంలో డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులపై బ్యాంకులు రివార్డులు, క్యాష్ బ్యాక్స్ ఇస్తాయి. ఆన్‌లైన్‌లో ఏ కార్డుల ద్వారా ఏ ఆఫర్ వస్తుందో చెక్ చేసుకోవాలి. అవసరానికి తగినంత డబ్బు చేతిలో లేకపోతే తర్వాత కట్టచ్చులే అని క్రెడిట్ కార్డును ఇష్టమచ్చినట్లు వాడేయకూడదు. ఇచ్చిన సమయంలోపు తిరిగి చెల్లించలేకపోతే వడ్డీ ఎక్కువ కట్టాల్సి వస్తుంది. క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. అప్పుల ఊబిలో కూరుకుపోవచ్చు. పండగల సీజన్‌లో ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్లు సైతం వల వేస్తుంటారు. మొబైల్ ఫోన్‌కు, ఇ-మెయిల్స్‌కు ఆఫర్లు ఇస్తున్నామని లింకులు పంపిస్తుంటారు. అలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. ఆఫర్ వస్తుంది కదా అని లింకులు తెరిస్తే మీ ఫోన్ హ్యాక్ అవుతుంది. మీ బ్యాంక్ ఖాతాల్లో ఉండే డబ్బు మొత్తం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అయితే, పండగ షాపింగ్ ఎంత జాగ్రత్తగా చేస్తారో అంతకన్నా ఎక్కువగా ఆఫర్ల విషయంలో జాగ్రత్త పడాలి. తక్కువ ధరకే ఇస్తున్నారని ఆశపడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది.

# జీఎస్టీ రేట్ల కోత.... సెప్టెంబర్ 22లోగా చేయాల్సిందే




వస్తు, సేవల పన్ను జీఎస్టీలో చేపట్టిన సంస్కరణలను ప్రజల సంస్కరణగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో దేశంలోని ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. వినియోగం పెరుగుతుందని, దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అయితే, జీఎస్టీ రేట్లను తగ్గించినప్పటికీ అది ప్రజలకు చేరవేయడంలో కంపెనీలు, హోటళ్లు, దుకాణదారులు జాప్యం చేయవచ్చన్న ఆందోళన లు నెలకొన్నాయి. ఈ అంశంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని ప్రజలకు చేరవేసేందుకు తానే వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. నేరుగా తానే రంగంలోకి దిగి ఈ విషయాన్ని పర్యవేక్షిస్తూ ఉంటానని, కచ్చితంగా ప్రజలకు అందేలా చూస్తామన్నారు. పరిశ్రమ సైతం ఇప్పటికే జీఎస్టీ రేట్ల కోతలపై సానుకూలతలు చూపించినట్లు చెప్పారు నిర్మలా సీతారామన్. ఈ నిర్ణయం తీసుకున్న కొద్ది రోజుల్లోనే కార్ల తయారీ సంస్థల నుంచి బీమా కంపెనీలు, షూ, దుస్తుల బ్రాండ్ల ధరల తగ్గింపును ప్రకటించాయని పేర్కొన్నారు. కొత్త జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చే సెప్టెంబర్ 22వ తేదీ నాటికి మిగిలిన సంస్థలూ దీనిని అనుసరించే అవకాశాలు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 22 నుంచి కచ్చితంగా తగ్గించిన రేట్లను అమలు చేయాల్సిందేనన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం నాటి నుంచే జీఎస్టీ కొత్త రేట్లు అమలులోకి వస్తాయని, అప్పటి నుంచి సబ్బుల నుంచి కార్ల వరకు, ఎయిర్ కండిషనర్ల నుంచి షాంపులు, ట్రాక్టర్ల వరకు మొత్తం 400 ఉత్పత్తుల వరకు ధరలు దిగివస్తాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్య జీవిత బీమా ప్రీమియం పన్ను రహితంగా మారుతుందన్నారు. రూపాయి కూడా జీఎస్టీ కట్టాల్సిన అవసరం రాదని, దీంతో ప్రీమియం దిగువస్తుందని చెప్పారు. అయితే, హానికర ఉత్పత్తులు, అల్ట్రా లగ్జరీ వస్తువులపై కొత్త శ్లాబు 40 శాతం ప్రకారం జీఎస్టీ అమలవుతుందన్నారు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తాజా జీఎస్టీ సంస్కరణలు 140 కోట్ల మంది ప్రజల జీవితాలను తాకుతాయన్నారు.

# ఆసియా కప్-2025: పూర్తి షెడ్యూల్, అన్ని జట్లు, లైవ్ స్ట్రీమింగ్ వివరాలు




ఖండాంతర క్రికెట్ టోర్నమెంట్ ఆసియా కప్ ఈసారి పొట్టి ఫార్మాట్లో జరిగే ఈ ఈవెంట్లో ఎనిమిది జట్లు భాగంగా ఉన్నాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో టీమిండియా (2023 వన్డే ఫార్మాట్ విజేత) బరిలోకి దిగుతుండగా.. శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్, ఒమన్, యూఏఈ, హాంకాంగ్ కూడా పాల్గొంటున్నాయి. ఈ టోర్నీ ఆతిథ్య హక్కులు భారత్‌వే అయినా.. పాక్ కూడా ఈ ఈవెంట్లో భాగమైనందున తటస్థ వేదికైన యూఏఈలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మరి.. ఆసియా కప్-2025 టోర్నీ పూర్తి షెడ్యూల్, అన్ని జట్లు, మ్యాచ్ ఆరంభ సమయం, ప్రత్యక్ష ప్రసారం తదితర వివరాలు తెలుసుకుందామా!!

**గ్రూపులు- రెండు**

గ్రూప్-'ఎ'- భారత్, పాకిస్తాన్, యూఏఈ, ఒమన్

గ్రూప్-'బి'- శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్, హాంకాంగ్

**పూర్తి షెడ్యూల్, మ్యాచ్ ఆరంభ సమయం**

సెప్టెంబరు 9: అఫ్గనిస్తాన్ వర్సెస్ హాంగ్‌కాంగ్- అబుదాబి- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 10: ఇండియా వర్సెస్ యూఏఈ- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 11: బంగ్లాదేశ్ వర్సెస్ హాంగ్‌కాంగ్- అబుదాబి- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 12: పాకిస్తాన్ వర్సెస్ ఒమన్- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 13: బంగ్లాదేశ్ వర్సెస్ శ్రీలంక- అబుదాబి- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 14: ఇండియా వర్సెస్ పాకిస్తాన్- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 15: యూఏఈ వర్సెస్ ఒమన్- అబుదాబి- సాయంత్రం 5.30 నిమిషాలకు

సెప్టెంబరు 15:శ్రీలంక వర్సెస్ హాంగ్‌కాంగ్- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 17: పాకిస్తాన్ వర్సెస్ యూఏఈ- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 18: శ్రీలంక వర్సెస్ అఫ్గనిస్తాన్- అబుదాబి- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 19: ఇండియా వర్సెస్ ఒమన్- అబుదాబి- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 20: గ్రూప్- బి టాపర్ వర్సెస్ రెండో స్థానంలో ఉన్న జట్టు (%దీ1 ఎం దీ%2)- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 21: గ్రూప్-ఎ టాపర్ వర్సెస్ రెండో స్థానంలో ఉన్న జట్టు (%ూ1 జం౦ూ%2)- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 23: %ూ2 జం దీ%1- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 24: %ూ1 జం దీ%2- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 25: %ూ2 జం దీ%2- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 26: %ూ1 జం దీ%1- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు

సెప్టెంబరు 28: ఫైనల్- దుబాయ్- రాత్రి ఎనిమిది గంటలకు.

**జట్లు ఇవే టీమిండియా**

సూర్య కుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, రింకూ సింగ్. రిజర్వు ప్లేయర్లు: ప్రసిద్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్.

పాకిస్తాన్

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హరీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారీస్ (వికెట్-కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహిన్ అఫ్రిది, సూఫియాన్ మొకిమ్

**యూఏఈ**

ముహమ్మద్ వసీం (కెప్టెన్), అలిశాన్ షరాఫూ, ఆర్యాంశ్ శర్మ (వికెట్ కీపర్), ఆసిఫ్ ఖాన్, ధ్రువ్ పరాశర్, ఈథన్ డిసౌజా, హైదర్ అలీ, హర్షిత్ కౌశిక్, జునైద్ సిద్దిఖీ, మతీఉల్లా ఖాన్, ముహమ్మద్ ఫారూక్, ముహమ్మద్ జవాదుల్లా, ముహమ్మద్ జోహైబ్, రాహుల్ చోప్రా (వికెట్ కీపర్), రోహిద్ ఖాన్, సిమ్రన్‌జీత్ సింగ్, సాఘిర్ ఖాన్.

**ఒమన్**

జతీందర్ సింగ్ (కెప్టెన్), హమ్మద్ మీర్జా, వినాయక్ శుక్లా, సూఫియాన్ యూసుఫ్, ఆశిష్ ఒడెదెరా, అమీర్ కలీమ్, మహ్మద్ నదీమ్, సూఫియాన్ మెహమూద్, ఆర్యన్ బిష్త్, కరణ్ సోనావాలే, జిక్రియా ఇస్లాం, హస్నైన్ అలీ షా, ఫైసల్ షా, మహమ్మద్ ఇమ్రాన్, షకీల్ అహ్మద్, సమయ్ శ్రీవాస్తవ.

**శ్రీలంక**

చరిత్ అసలంక (కెప్టెన్), కుశాల్ మెండిస్ (వికెట్‌కీపర్), పాతుమ్ నిస్సాంక, కుశాల్ పెరీరా, కమిల్ మిషార, దసున్ షనక, కమిందు మెండిస్, వనిందు హసరంగ, నువానీదు ఫెర్నాండో, దునిత్ వెల్లాలగే, చమిక కరుణరత్నే, మహీశ్ తీక్షణ, మతీశ పతిరణ, నువాన్ తుషార, దుష్మంత చమీరా, బినుర ఫెర్నాండో.

**బంగ్లాదేశ్**

లిట్టన్ కుమార్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్, పర్వేజ్ హొస్సేన్ ఇమాన్, సైఫ్ హసన్, తౌహిద్ హ్రిదోయ్, జాకర్ అలీ అనిక్, షమీమ్ హొస్సేన్, క్వాజీ నూరుల్ హసన్ సోహన్, షాక్ మహేదీ హసన్, రిషద్ హుస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తాంజిమ్ హసన్ సకిబ్, టస్కిన్ అహ్మద్, షరీఫుల్ ఇస్లాం, సైఫ్ ఉద్దీన్ స్టాండ్‌బై ప్లేయర్లు: సౌమ్య సర్కార్, మెహిదీ హసన్ మిరాజ్, తన్వీర్ ఇస్లాం, హసన్ మహమూద్.

**అఫ్గనిస్తాన్**

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, దర్విష్ రసూలీ, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, కరీం జనత్, మహ్మద్ నబీ, గుల్బాదిన్ నాయబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రహమాన్, అల్లాహ్ గజన్ఫార్. నూర్ అహ్మద్, ఫారిక్ అహ్మద్ మాలిక్, నవీన్-ఉల్-హక్, ఫజల్హాక్ ఫరూకీ రిజర్వ్ ఆటగాళ్లు: వఫివుల్లా తారఖాల్, నంగ్యాల్ ఖరోటే, అబ్దుల్లా అహ్మద్‌జాయ్

**హాంకాంగ్**

యాసిమ్ ముర్తాజా (కెప్టెన్), బాబర్ హయత్, ఆదిల్ మెహమూద్, జీషన్ అలీ (వికెట్ కీపర్), ఎహ్సాన్ ఖాన్, అనాస్ ఖాన్, షాహిద్ వాసిఫ్ (వికెట్ కీపర్), కల్హన్ చల్లు, హరూన్ అర్షద్, నిజకత్ ఖాన్, ఆయుశ్ శుక్లా, అలీ హసన్, నస్రుల్లా రానా, ఐజాజ్ ఖాన్, ఎండీ ఘజన్‌ఫర్, మార్టిన్ కోయెట్జీ, అతీక్ ఇక్బాల్, మహ్మద్ వాహిద్, అన్షుమన్ రథ్, కించిత్ షా.

**ప్రత్యక్ష ప్రసారం ఎక్కడంటే..**

ఆసియా కప్-2025 టీ20 మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ (టీవీ)లో వీక్షించవచ్చు. డిజిటల్ యూజర్ల కోసం సోనీలివ్ వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

**ప్రైజ్ మనీ ఎంతంతంటే?**

ఆసియాకప్-2022(టీ20 ఫార్మాట్) ఛాంపియన్స్‌గా నిలిచిన శ్రీలంకకు దాదాపు 200,000 డాలర్ల( సుమారు రూ. 1.6 కోట్లు) ప్రైజ్‌మనీ లభించింది. ఈ ఏడాది ఆసియా విజేతగా నిలిచే జట్టుకు 300,000 డాలర్లు (దాదాపు రూ. 2.6 కోట్లు) నగదు బహుమతి ఏసీసీ అందజేయనున్నట్లు సమాచారం. గత ఎడిషన్‌తో పోలిస్తే ఇది 50 శాతం అధికం. రన్నరప్‌గా నిలిచే జట్టు 150,000 డాలర్లు (సుమారు రూ. 1.3 కోట్లు) ప్రైజ్‌మనీ సొంతం చేసుకోనుంది. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు వరుసగా రూ. 80, 60 లక్షలు దక్కించుకోనున్నాయి.

## స్పోర్ట్స్

### ట్రై సిరీస్ ఫైనల్లో హ్యాట్రిక్ తీసిన పాకిస్థానీ బౌలర్




షార్జా: ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన యూఏఈ టీ20 ట్రై సిరీస్ ఫైనల్లో పాకిస్థానీ బౌలర్ మొహమ్మద్ నవాజ్( %వీశీష్ణుఎమ్మిఎ ఛీఝఝఓ%) హ్యాట్రిక్ తీశాడు. ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 75 రన్స్ తేడాతో పాకిస్థాన్ విక్టరీ కొట్టింది. ఆ జట్టు బౌలర్ నవాజ్ తన స్పిన్ మంత్రంతో ఆఫ్ఘన్‌ను కట్టడి చేశాడు. ఫైనల్లో 19 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడుతను. 142 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆఫ్ఘన్ జట్టు 15.5 ఓవర్లలో 66 రన్స్‌కే ఆలౌటైంది. పాక్ జట్టులో ఫకర్ జమాన్ 27 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆఫ్ఘన్ కెప్టెన్ రషీద్ ఖాన్ మూడు వికెట్లు తీసుకున్నాడు. పాక్ స్పిన్నర్ నవాజ్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో చివరి రెండు బంతులకు వికెట్లు తీసుకున్నాడు. దార్విశ్ రసూలీ, అజ్మతుల్లా ఓమర్‌జాయి వికెట్లను తీశాడతను. అయితే ఆ తర్వాత ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో తొలి బంతికే ఇబ్రహీమ్ జద్రాన్‌ను ఔట్ చేసి తన ఖాతాలో హ్యాట్రిక్ వేసుకున్నాడతను. టీ20ల్లో హ్యాట్రిక్ తీసిన మూడవ పాకిస్థానీ బౌలర్‌గా నవాజ్ నిలిచాడు. గతంలో ఫహీమ్ అష్రఫ్, మొహమ్మద్ హస్నైన్ హ్యాట్రిక్ తీశారు.



## రానాతో కలిసి నటించానన్న శివకార్తికేయన్.. ఇంతకీ ఏ సినిమానో తెలుసా..?

ఇటీవలే ఏఆర్ మురుగదాస్ డైరెక్షన్‌లో తెరకెక్కిన మదరాసి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు శివకార్తికేయన్ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కేవలం రెండు రోజుల్లోనే రూ.50 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. కాగా ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ (25వ చిత్రం) 'పరాశక్తి' ఆకాశం నీ హద్దురా ఫేం డైరెక్టర్ సుధా కొంగర డైరెక్ట్ చేస్తున్నారు. పొలిటికల్ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న పరాశక్తిలో బాహుబలి యాక్టర్ రానా కీలక పాత్రలోనటిస్తున్నాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే దీనిపై మూవీ లవర్స్‌లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు శివకార్తికేయన్. సైమా అవార్డ్స్ ఈవెంట్‌లో డాన్ యాక్టర్ స్టన్నింగ్ వార్తను షేర్ చేశాడు. తాను రానా దగ్గుబాటితో కలిసి నటించానన్నాడు శివకార్తికేయన్. అయితే ఆ ప్రాజెక్ట్ ఏంటో చెప్పకపోయినప్పటికీ.. పరాశక్తి అని హింట్ ఇచ్చేశాడు. రానా పొల్లాచ్చి షూటింగ్‌లో శ్రీలీలతో కలిసి జాయిన్ అయ్యాడని సమాచారం. ఈ మూవీలో రానాతోపాటు అథర్వ, రవి మోహన్, బాసిల్ జోసెఫ్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు రానా మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ మిరాయిలో కూడా కనిపించనున్నట్టు వార్తలు వస్తుండగా.. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది.



## రామ్ పోతినేని ఆంధ్ర కింగ్ తాలూకా.. పప్పీ షేమ్ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ హీరో రామ్ పోతినేని నటిస్తోన్న లేటేస్ట్ మూవీ 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే.. రామ్‌కు జంటగా నటిస్తోంది. ఈ మూవీకి మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 28న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలోని పప్పీ షేమ్ అనే పాటను విడుదల చేశారు. అయితే ఈ సాంగ్‌ను రామ్‌నే ఆలపించడం విశేషం. ఆ పాటకు భాస్కరభట్ల లిరిక్స్ అందించహా.. వివేక్, మెర్విన్ కంపోజ్ చేశారు. కాగా.. ఈ సినిమాలో ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు.

## మళ్లీ అదే స్టోరీ... ఇక్కడ ఫ్లాప్ అక్కడ హిట్

ఒకప్పుడు తమిళ సినిమాల క్వాలిటీనే వేరుగా ఉండేది. మార్కెట్ పరంగా రేంజ్ తక్కువ కావచ్చు కానీ.. కంటెంట్ క్వాలిటీ మాత్రం ఇండియాలో ఏ ఇండస్ట్రీకి తీసిపోని స్థాయిలో అక్కడి సినిమాలుండేవి. అక్కడ అనేక ప్రయోగాలు జరిగేవి. కమర్షియల్ సినిమాల్లోనూ వైవిధ్యం చూపించేవాళ్లు. రొటీన్ సినిమాలను పెద్దగా పట్టించుకునే వాళ్లు కాదు. కానీ గత దశాబ్ద కాలంలో మొత్తం మారిపోయింది. తమిళ సినిమాల క్వాలిటీ బాగా పడిపోయింది. ఒకప్పుడు అద్భుతమైన సినిమాలు అందించిన శంకర్, మణిరత్నం, మురుగదాస్ లాంటి దర్శకుల నుంచి పేలవమైన సినిమాలు వస్తున్నాయి.మురుగదాస్ సంగతే తీసుకుంటే.. 'స్పైడర్' దగ్గర్నుంచి ఆయన వరుసగా డిజాస్టర్లు డెలివర్ చేస్తున్నాడు. ఈ ఏడాది బాలీవుడ్లో ఆల్రెడీ 'సికందర్' సినిమాతో షాక్ తిన్నాడు మురుగదాస్. తమిళంలో తీసిన 'మదరాసి'తో ఆయన పుంజుకుంటాడేమో అని అభిమానులు ఆశించారు. ఐతే ఈ సినిమాకు కూడా డివైడ్ టాక్ తప్పలేదు. మురుగదాస్ గత చిత్రాలతో పోలిస్తే కొంచెం బెటర్ అనే టాక్ వచ్చింది తప్ప.. ఓవరాల్‌గా ఇది మెప్పించే సినిమా అయితే కాదు. విపరీతమైన సాగతీత.. యాక్షన్ ఎపిసోడ్లు తప్ప విషయం లేని బోరింగ్ సెకండాఫ్ సినిమాకు పెద్ద మైనస్ అయింది. తెలుగులో ఈ సినిమాకు ఆరంభం నుంచి ఆశించిన వసూళ్లు లేవు. రెండో రోజు సినిమా మరింత వీక్ అయింది. ఇక్కడ 'మదరాసి' ఫ్లాప్ అని తేలిపోయింది. కానీ తమిళంలో మాత్రం 'మదరాసి' వీకెండ్లో బాగా ఆడుతోంది. శుక్ర, శనివారాల్లో ఈ చిత్రం తమిళంలో మంచి ఆక్యుపెన్సీలతో నడిచింది. ఆదివారం కూడా చెన్నై సహా మేజర్ సిటీస్‌లో 'మదరాసి' స్ట్రాంగ్‌గానే కనిపిస్తోంది.





## 'కొంచెం కూడా సెన్స్ లేదు మీకు.. రాస్కెల్స్'.. మంచు లక్ష్మీ ఫైర్ !

టాలీవుడ్ నటి మంచు లక్ష్మి దాదాపు ఐదేళ్ల తర్వాత వెండితెరపై కనిపించనుంది. ప్రస్తుతం ఆమె దక్ష (ది డెడ్లీ కాన్సిఫరిసీ) అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే ఈ చిత్రం టీజర్ విడుదల చేయగా.. ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీని తన సొంత బ్యానర్ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌లో తెరకెక్కించారు. ఈ సినిమాకు మోహన్ బాబు, లక్ష్మీ ప్రసన్న నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీకి వంశీకృష్ణ మల్ల దర్శకత్వం వహించారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న థియేటర్లలో విడుదల కానుంది. అయితే ఇటీవల దుబాయ్‌లో జరిగిన సైమా అవార్డ్స్-2025 వేడులకు హాజరైంది. మంచు లక్ష్మీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. అక్కడే మంచు లక్ష్మీ వేదిక వద్దకు వెళ్తుండగా ఆమెతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. అదే సమయంలో ఓ అభిమాని అసభ్యకరంగా కామెంట్ చేయడంతో మంచు లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ధైర్యం ఉంటే నా ముందుకు వచ్చి మాట్లాడరా? మీకసలు సెన్స్ లేదు రాస్కెల్స్.. అంటూ మండిపడింది. ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్స్ సైతం కామెంట్ చేస్తున్నారు. ఆ తర్వాత చాలామంది అభిమానులతో సెల్ఫీలకు పోజులిచ్చింది మంచు లక్ష్మీ. కాగా.. మంచు లక్ష్మీ నటించిన యాక్షన్ అండ్ క్రైమ్ థ్రిల్లర్‌లో సముద్రఖని, మలయాళ నటుడు సిద్దిక్, చైత్ర శుక్ల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మోహన్ బాబు కూడా ఒక ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా మంచు లక్ష్మీ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ నుంచి పదేళ్ల తర్వాత దక్ష రూపంలో మరో చిత్రం విడుదల కానుంది. 2015లో మామ మంచు అల్లుడు కంచు మూవీ ఆ బ్యానర్ నుంచి చివరిగా విడుదలైంది.



## జాన్వీ కపూర్ చాలా గ్రేట్.. అనీల్ కపూర్ కామెంట్స్ వైరల్

బాలీవుడ్ బ్యూటీ, అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో బిజీగా ఉంటూనే, సౌత్ సినిమాల్లోనూ తన మార్క్ క్రియేట్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఎన్టీఆర్‌తో నటించిన "దేవర" చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న జాన్వీ, త్వరలోనే రామ్ చరణ్ సరసన "పెద్ది" సినిమాతో పలకరించబోతుంది. ఈ సినిమాపై జాన్వీ చాలా హోప్స్ పెట్టుకుంది.ఈ సినిమాని బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధతో తెరకెక్కిస్తుండగా, ఇందులో జాన్వీ పాత్ర కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉండనుందని అంటున్నారు. అయితే తాజాగా జాన్వీ గురించి బాలీవుడ్ ప్రముఖ నటుడు, ఆమె బాబాయ్ అయిన అనిల్ కపూర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో వైరల్‌గా మారాయి. సాధారణంగా స్టార్ హీరోయిన్ షూటింగ్‌కి వస్తే, రెమ్యూనరేషన్ కాకుండా, ఆమె ట్రావెలింగ్, హోటల్, ఫుడ్ ఖర్చులతో పాటు, స్టాఫ్, తల్లి, మేనేజర్ల ఖర్చులు అన్నీ నిర్మాతే భరిస్తారు. ఇది ఇండస్ట్రీలో ఓ సాధారణ నిబంధనగా మారిపోయింది. అయితే ఈ విషయంలో జాన్వీ కపూర్ మాత్రం భిన్నంగా ఉంటుందని అనిల్ కపూర్ వెల్లడించాడు. జాన్వీ ఎక్కడికైనా షూటింగ్‌కి వెళ్లాల్సి వచ్చినప్పుడు ఫ్లైట్ టికెట్లు తనవే. స్టాఫ్ కావొచ్చు, సహాయులు కావొచ్చు, ఎవ్వరైనా ఆమెతో వస్తే వాళ్ల ఖర్చులు కూడా జాన్వీనే భరిస్తుంది. నిర్మాతలపై ఎలాంటి అదనపు భారంగా మోపదు. ఆమె అంతా స్వయంగా చూసుకుంటుంది అని అన్నారు అనిల్. అనిల్ కపూర్ ఈ కామెంట్స్ చేసిన తర్వాత, జాన్వీ కపూర్‌పై పరిశ్రమవర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి. ఇప్పటి తారలు చిన్న విషయానికే పెద్ద బడ్జెట్ భారాన్ని నిర్మాతలపై మోపుతున్న కాలంలో, జాన్వీ లాంటి స్టార్ హీరోయిన్ తన ఖర్చులను తానే భరించడం నిజంగా ప్రశంసనీయం అంటున్నారు. జాన్వీని చూసి ఇతర హీరోయిన్స్ తమ పద్ధతిని మార్చుకుంటారా అని ముచ్చటించుకుంటున్నారు. ఈ రోజుల్లో నిర్మాతలు ఖర్చుల విషయంలో తడిసి ముద్దవుతున్నారు. అలాంటి సమయంలో జాన్వీ లాంటి సెలబ్రిటీలను ఆదర్శంగా తీసుకుంటే, ఇండస్ట్రీకి అంతా మంచి జరుగుతుంది. ఇక జాన్వీకి ఇప్పుడు బాలీవుడ్ ప్రాజెక్ట్స్ తోపాటు, త్వరలో మరిన్ని సౌత్ ఆఫర్స్ లైన్‌లో ఉన్నట్టు సమాచారం.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.